

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

# అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | బుధవారం | 01.07.2026 | సంపుటి: 3 | సంచిక: 149 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | WEDNESDAY | 01.07.2026 | VOLUME : 3 | ISSUE : 149 | PAGES: 8 | COST: 2/- |



**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575




## జూలై 2న రాష్ట్ర మంత్రి మండలి సమావేశం


- మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయంలో భేటీ
- జూలై 1లోపు అజెండా పంపాలని శాఖలకు ఆదేశాలు
- అజెండా లేకపోయినా 'నిల్' నివేదిక తప్పనిసరి
- సమావేశం రోజున అధికారులు ప్రధాన కార్యాలయంలోనే ఉండాలి
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ

2

## అసెంబ్లీపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీల గురి

- వచ్చే ఎన్నికలకే ఇప్పట్నుంచే కసరత్తు
- శాసన మండలి నుంచి అసెంబ్లీకి వెళ్లాలని పలువురి లక్ష్యం
- నియోజకవర్గాల్లో పర్యటనలు.. కార్యకర్తలతో మమేకం
- టికెట్ల కోసం ముందస్తు వ్యూహాలతో గులాబీ నేతలు

2



### 30 నెలల్లో రూ.30 వేల కోట్ల

## రైతు భరోసా ఎగవేత



- సభల పేరుతో నాటకాలు
- రైతులకు చేసిందేమీ లేదు
- మరోమారు రేవంత్‌పై కేటీఆర్ విమర్శలు

**హైదరాబాద్, జూన్ 30:**

కాంగ్రెస్ ముప్పై నెలల పాలనలో రూ.30 వేల కోట్ల రైతుభరోసా ఎగ్గొటారని, పైగా సభల పేరుతో నాటకాలు ఆడుతున్నారని


మిగతా 2వ పేజీలో..

### రూ.45 లక్షల ఉద్యోగం వదిలి..

## చివరకు సున్నాకే

- స్టార్టప్‌ల కోసం భారీ వేతనాన్ని త్యాగం చేసిన యువకుడి ఆవేదన
- రెండు వ్యాపారాలు విఫలమై జీవితకాల పొదుపు కోల్పోయిన టెక్ నిపుణుడు
- మళ్లీ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్నా వెంటాడుతున్న భయం

2



# రైతు భరోసా తొలి విడత

# నిధుల విడుదల



- 44.28 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.2,482 కోట్లు జమ
- వ్యవసాయాన్ని పండుగగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమన్న సీఎం
- అన్నదాతలకు పెట్టుబడి భారం తగ్గించే దిశగా చర్యలు
- బీఆర్ఎస్ హయాంలో అప్పులు భారీగా పెరిగాయని విమర్శ
- గత ప్రభుత్వ ఆర్థిక విధానాలపై రేవంత్ తీవ్ర వ్యాఖ్యలు

**హైదరాబాద్, జూన్ 30:**

రాష్ట్రంలోని రైతులకు పెట్టుబడి సాయంగా రైతు భరోసా పథకం తొలి విడత నిధులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం విడుదల చేశారు. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో బటన్ నొక్కి రెండు ఎకరాల లోపు భూమి కలిగిన 44.28 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.2,482 కోట్లను నేరుగా జమ చేశారు. రైతుల

మిగతా 2వ పేజీలో..

## సిగాచి కార్మికుల మరణం ప్రభుత్వ వైఫల్యమే

- మృతులకు ఇస్తానన్న కోటి పరిహారం ఇవ్వలేదు
- కార్మికుల కష్టార్జితాన్ని పరిహారంగా చూపిన ఘనత ఈ ప్రభుత్వానిది
- ఇప్పటికైనా వారికి నష్టపరిహారంచెల్లించాలి
- మాజీ మంత్రి హరీష్‌రావు డిమాండ్



**హైదరాబాద్, జూన్ 30:**

సరిగ్గా ఏడాది క్రితం అంటే 2025 జూన్ 30 రాష్ట్రపారిశ్రామిక చరిత్రలో ఒక చీకటి రోజు. కూటి కోసం, కూలి కోసం వలస వచ్చి సిగాచి పరిశ్రమలో పనిచేస్తున్న 54 మంది పేద కార్మికులు సజీవదహనమైన దుర్దినం. రేవంత్ రెడ్డి ప్రభుత్వ నియంత్రణ, పర్యవేక్షణ

మిగతా 2వ పేజీలో..

## కాంగ్రెస్ ఢిల్లీ దర్బార్‌కు ఏటీఎంగా తెలంగాణ



- బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ విమర్శ

**హైదరాబాద్,జూన్ 30:**

కాంగ్రెస్ ఢిల్లీ దర్బార్‌కు తెలంగాణను ఏటీఎంగా మార్చారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ విమర్శించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అధ్యక్షతన మల్కాజిగిరిలోని ఔషాపూర్ రాక్ ఎంక్లేవ్‌లో జరిగిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ నేతృత్వంలో బీజేపీ వెంట నడిచేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారు. బీజేపీను గెలిపించిన రాష్ట్రాల్లో ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నాం. దేశంలో 12 ఏళ్లలో చాలా పరివర్తన వచ్చింది. కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి. పశ్చిమబెంగాల్‌లో

మిగతా 3వ పేజీలో..



2

## మంత్రి శ్రీధర్ బాబు టార్గెట్

- ఏఐతో మార్ఫింగ్ వీడియోలు సృష్టించి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం
- మంత్రి దంపతుల పరువుకు భంగం కలిగించే ప్రయత్నమంటూ ఫిర్యాదు
- కాళేశ్వరం అంశంతో తప్పుడు ప్రచారం చేశారన్న ఆరోపణలు
- లాయర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు



## ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై విద్యార్థులకు ఊరట

- హైకోర్టులో విచారణ 6కు వాయిదా

**హైదరాబాద్,జూన్ 30:**

ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన పిటిషన్లపై విచారణను హైకోర్టు జులై 6వ

మిగతా 3వ పేజీలో..

## ప్రత్యేక పోలీస్ బలగాలు రాష్ట్ర భద్రతకు బలమైన కవచం

- ఆధునికీకరణ, సాంకేతికతతో మరింత బలోపేతం
- ఖాళీల భర్తీ.. 'ఫ్యూచర్ సిటీ', ఆమనగల్‌లో కొత్త బెటాలియన్లు
- వరద సహాయక చర్యల్లో అంకితభావం.. సిబ్బందిపై డీజీపీ ప్రశంసలు
- సిబ్బంది సంక్షేమమే ముఖ్యం: మానసిక ఒత్తిడికి 'మిత్ర' కౌన్సెలింగ్



హైదరాబాద్, జూన్ 30:

హైదరాబాద్, జూన్ 30: రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, ఎన్నికల నిర్వహణ, విపత్తు నిర్వహణ, వీఐపీ బందోబస్తు, ప్రత్యేక ఆపరేషన్లలో కీలక భూమిక పోషిస్తున్న తెలంగాణ స్పెషల్ బెటాలియన్లను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మరింత ఆధునికంగా, సాంకేతికంగా బలోపేతం చేయాలని రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ అధికారులకు సూచించారు. జూబ్లీహిల్స్‌లోని తెలంగాణ స్పెషల్ బెటాలియన్ల ప్రధాన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఆయన

మిగతా 3వ పేజీలో..



## ఏరోస్పేస్ రాజధానిగా తెలంగాణ

- హైదరాబాద్ నుంచే ప్రపంచ విమానయాన భవిష్యత్తుకు దిశానిర్దేశం
- 'మేడ్ ఇన్ తెలంగాణ' ప్రపంచ ఆకాశంలో ఎగురుతోంది
- రాష్ట్ర అంతర్జాతీయ ప్రాధాన్యతను పెంచిన ఏరోమార్ట్
- మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 30:**

ప్రపంచ ఏరోస్పేస్ పరిశ్రమకు తెలంగాణ కొత్త కేంద్రంగా అవతరిస్తోందని, ఇకపై అత్యాధునిక విమానాలు, యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, రక్షణ వ్యవస్థల తయారీలో హైదరాబాద్ ప్రపంచ పటంలో అగ్రస్థానంలో నిలవబోతోందని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి కెప్టెన్

మిగతా 2వ పేజీలో..



## అసోంలో భారీ ఆపరేషన్

- అక్రమంగా తరలిస్తున్న 37 కిలోల బంగారం స్వాధీనం

2



# అసెంబ్లీపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీల గురి

హైదరాబాద్, జూన్ 30:

తెలంగాణలో సాధారణ ఎన్నికలకు ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉన్నప్పటికీ బీఆర్ఎస్‌లో ఎన్నికల సందడి ఇప్పటినుంచే కనిపిస్తోంది. ముఖ్యంగా శాసన మండలి సభ్యులుగా ఉన్న పలువురు నేతలు వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీ బరిలో నిలవాలనే లక్ష్యంతో తమ రాజకీయ కార్యకలాపాలను వేగవంతం చేస్తున్నారు. ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో పర్యటిస్తూ కార్యకర్తలతో మమేకమవుతున్నట్లు పార్టీలో చర్చ సాగుతోంది.

**నియోజకవర్గాల్లో చురుకైన పర్యటనలు**

పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్సీలు తాము పోటీ చేయాలనుకుంటున్న నియోజకవర్గాలను ఇప్పటికే గుర్తించి అక్కడ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నట్లు సమాచారం. స్థానిక నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించడం, ప్రజల సమస్యలను తెలుసుకోవడం, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా రాజకీయంగా పట్టు సాధించే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ చేపడుతున్న కార్యక్రమాల నిర్వహణలో కూడా కొందరు ఎమ్మెల్సీలు నియోజకవర్గ ఇంచార్జిల కంటే ఎక్కువ చొరవ చూపుతున్నారనే చర్చ సాగుతోంది.

**పోటీకి సిద్ధమవుతున్న నేతలు**

రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు శేరిలింగంపల్లి నుంచి పోటీ చేయాలని భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి షాద్‌నగర్‌పై దృష్టి పెట్టినట్లు సమాచారం. ఖమ్మం జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ తాతా మధు పాలేరు నుంచి పోటీ చేయాలనే ఆలోచనలో ఉన్నారని, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు పాలకుర్తి టికెట్‌పై ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. నల్గొండ జిల్లా ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి నాగార్జునసాగర్ టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారని, శాసన మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి మరోసారి భూపాలపల్లి నుంచి పోటీ చేయాలని భావిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది.

వీరితో పాటు మరికొందరు ఎమ్మెల్సీలు కూడా స్థానికంగా రాజకీయ కార్యక్రమాలు నిర్వహిస్తూ తమ అభ్యర్థిత్వాన్ని పరోక్షంగా చాటుకునే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. అయితే ప్రస్తుతం ఎవరికీ ముందస్తుగా టికెట్ హామీ ఇవ్వబోమని, ప్రతి నాయకుడు క్షేత్రస్థాయిలో పనిచేయాల్సిందేనని పార్టీ అధిష్టానం స్పష్టం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయానికి నిర్వహించే సర్వేల ఆధారంగానే అభ్యర్థుల ఎంపికపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

# సిగాచి కార్మికుల మరణం ప్రభుత్వ వైఫల్యమే

మొదటిపేజీ తరువాయి

వైఫల్యం.. సిగాచి కంపెనీ నిర్లక్ష్యం కారణంగా ప్రాణాలు కోల్పోయిన అమాయక కార్మికులకు నివాళులర్పిస్తున్నానని మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తెలిపారు. ఈ హృదయవిధారక ఘటనతో యావత్ దేశం ఉలిక్కిపడింది కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మనసు మాత్రం కరగలేదన్నారు. దుర్ఘటన జరిగిన రోజు తన జూబ్లీహిల్స్ ప్యాలెస్ లోనే ఉన్నడు.. కానీ 20 కి.మీ దూరంలో ఉన్న సిగాచి పరిశ్రమ వద్దకు మాత్రం రాలేదు.. బాధిత కుటుంబాల కన్నీళ్లు తుడవలేదు.. విమర్శల నేపథ్యంలో తెల్లారి ఘటన వద్దకు వచ్చిన రేవంత్ రెడ్డి మృతదేహాల సాక్షిగా ప్రతి కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇస్తామని రేవంత్ ఘనంగా ప్రకటించారు.. ప్రభుత్వం తరపున ఇచ్చింది కేవలం రూ.లక్ష.. ఇంతకంటే సిగ్గుమాలిన చర్య ఏమైనా ఉంటదా.. తలదించుకోవాలి’ అని వ్యాఖ్యానించారు. కంపెనీ ఇచ్చిన డబ్బులు బాధిత కుటుంబాలకు ముట్టజెప్పి కోటి పరిహారం నుంచి తప్పించుకోవాలని చూస్తున్నరని ఆరోపించారు. కార్మికులు చనిపోవడం వల్ల చట్టబద్ధంగా వారికి రావాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ, లైఫ్ ఇన్సూరెన్స్ డబ్బులను కూడా కలుపుకుని పరిహారంలో చూపడం శోచనీయమన్నారు. అవేదో కంపెనీ జేబులోంచి ఇస్తున్న పరిహారం కాదు.. కార్మికులు కష్టార్జితం నుంచి హక్కుగా వచ్చిన డబ్బు.. ఆ డబ్బులను కూడా కంపెనీ ఇచ్చే పరిహారంలో కలిపి చూపించడం ఈ కాంగ్రెస్ ప్రభుత్వం, యాజమాన్య అమానవీయతకు, దిగజారుడుతనానికి పరాకాష్ట అని విమర్శించారు. చికిత్స పొందుతూ చనిపోయిన కార్మికుల వైద్య ఖర్చులను కూడా ఈ అరకొర పరిహారంలోనే కోత విధించారన్నారు. క్షతగాత్రులకు సరైన వైద్య సహాయం అందక, జీతాలు రాక అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బాధిత కుటుంబాలకు ఇస్తానన్న ఉద్యోగాలు ఇప్పటికీ దిక్కులేదు. కార్మిక శాఖ బాధ్యత రాహిత్యానికి అమాయక వలస బతుకులు వేదన చెందుతున్నాయి. ప్రమాదంలో కాలి బూడిదై ఆచూకీ దొరకని 8 మంది కార్మికుల కుటుంబాలను డెత్ సర్టిఫికెట్ల కోసం నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిప్పించుకున్న దుర్మార్గ ప్రభుత్వం ఇది. ఇది కేవలం ఒక ప్రమాదం కాదు, యాజమాన్యం నిర్లక్ష్యంతో జరిగిన సామూహిక హత్య అన్నారు. ఫ్యాక్టరీలో భద్రతా ప్రమాణాలు గాలికొదిలేశారని విచారణలో స్పష్టంగా తేలింది. 818 హెచ్‌పీ సామర్థ్యానికి మాత్రమే అనుమతి తీసుకుని అక్రమంగా 1777 హెచ్‌పీకి యంత్రాలను పెంచేశారు. సేఫ్టీ గార్డ్స్ లేవు, ఫైర్ ఎన్‌ఓసీ లేదు, డస్ట్ కంట్రోల్ సిస్టమ్ పనిచేయలేదు. ఇంత నిర్లక్ష్యం బయట పడినా, ప్రభుత్వం యాజమాన్యంపై చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమైందన్నారు. బాధితుల పక్షాన హైకోర్టులో కేసు వేసి న్యాయస్థానం మొట్టికాయలు వేస్తే తప్ప పోలీసులు కదలలేదు. తూతూ మంత్రంగా ఎండీని అరెస్టు చేయడం, వెంటనే ఆయన బెయిల్ మీద బయటకు వచ్చేలా పరోక్షంగా సహకరించడం చూస్తుంటే ప్రభుత్వానికి, కంపెనీ యాజమాన్యానికి మధ్య ఉన్న లోపాయికారీ ఒప్పందాలు ఏమిటో అర్థం అవుతూనే ఉందన్నారు. ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వందల కోట్ల టర్నోవర్ ఉన్న సిగాచి కంపెనీ డైరెక్టర్ల ఆస్తులను రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద అటాచ్ చేయాలి. వాటిని అమ్మి అయినా బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు బేషరతుగా రూ.కోటి పరిహారాన్ని తక్షణమే చెల్లించాలి. ఆనాడు మృతదేహాల సాక్షిగా ఇచ్చిన మాట ప్రకారం పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులతో సంబంధం లేకుండా ప్రతి బాధిత కుటుంబానికి రూ.కోటి పరిహారం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

**ఇతర రాష్ట్రాల వేద పండితులను నియమించడం బాధాకరం**

రాష్ట్రంలో ఎంతోమంది వేద పండితులు ఉండగా వారికి దక్కాల్సిన అవకాశాలు ఇతర రాష్ట్రాలకు ఇవ్వడం పట్ల హరీష్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. వేద పండితుల నియామకాల్లో, సెలెక్షన్ కమిటీల్లో స్థానిక వేద పండితులకే అవకాశాలు ఇవ్వాలన్నారు. యాదాద్రి, బాసర, భద్రాచలం తదితర ప్రముఖ దేవాలయాల్లో జరుగుతున్న వేద పండితుల నియామకాల్లో స్థానికులకు జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తూ తెలంగాణ వేద పండితుల ప్రతినిధులు హరీశ్ రావు, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో వేద పండితులను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం వేధించడం బాధాకరమని అన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా రాష్ట్రంలోని దేవాలయాల్లో స్థానిక వేద పండితులకు దక్కాల్సిన అవకాశాలు ఇతర రాష్ట్రాలకు చెందిన వారికి వెళ్తున్నాయన్న ఆరోపణలు అత్యంత ఆందోళనకరమన్నారు. తెలంగాణ యువత, స్థానిక వేద పండితుల హక్కులను పరిరక్షించడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. దేవాలయాల్లో భర్తీ చేసే వేద పండితుల పోస్టుల్లో స్థానికులకు ప్రాధాన్యం కల్పించాలని, స్థానిక రిజర్వేషన్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నియామక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, ఇంటర్వ్యూ బోర్డుల్లో కూడా రాష్ట్రానికి చెందిన అర్హులైన వేద పండితులకే అవకాశం కల్పించాలని కోరారు. రాష్ట్ర ఆవిర్భావం వెనుక స్థానికుల హక్కుల పరిరక్షణే ప్రధాన లక్ష్యమని, అలాంటి రాష్ట్రంలో స్థానిక వేద పండితులకు అన్యాయం జరిగే పరిస్థితి ఉండకూడదని హరీశ్ రావు అన్నారు. రాష్ట్రంలో అర్హులైన వేద పండితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని నియామక ప్రక్రియను సమీక్షించి స్థానికులకు ప్రాధాన్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

# 30 నెలల్లో రూ.30 వేల కోట్ల రైతుభరోసా ఎగవేత

మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టార్గెట్‌గా మరోసారి విమర్శలు గుప్పించారు. హైదరాబాద్ శిల్పకళా పైనుంచి సీఎం రేవంత్ రైతు భరోసా నిధులను మంగళవారం విడుదల చేయనున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వంపై ‘ఎక్స్’ వేదికగా కేటీఆర్ విరుచుకుపడ్డారు. 30 నెలల ముదనష్టపు పాలనలో దాదాపు రూ.30 వేల కోట్ల రైతుభరోసా ఎగ్గొట్టడమేకాక మళ్లీ సభల పేరిట నాటకాలు ఆడటానికి ఏమాత్రం సిగ్గనిపిస్తలేదా రేవంత్‌రెడ్డీ అని ప్రశ్నించారు. గత రెండున్నరేళ్లలో ఎగ్గొట్టిందే ఎక్కువ అని 70 లక్షల మంది రైతులు శాపనార్థాలు పెడుతుంటే ఆశీర్వాద సభల పేరిట డ్రామాలా? కేవలం ఒక్క బటన్ నొక్కి వేయాల్సిన రైతుభరోసాకు కూడా బహిరంగ సభ పెట్టే నీ పీఆర్ స్టంట్లు చూసి రైతులు అసహ్యించుకుంటున్నారన్నారు. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా నాలుగుసార్లు రైతుభరోసా ఎగ్గొట్టిన ద్రోహాన్ని రైతులు మరిచిపోతారని అనుకోవడం అవివేకమేనంటూ ఎకరానికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తానని గ్యారెంటీల గారడీ చేసి చివరికి ఉన్నది ఊడగొట్టే దుస్థితి తెచ్చినందుకు ముందు ముక్కు నేలకు రాయాలని హితవు పలికారు. అరకొరగా ఒకటి, రెండు ఎకరాలకు వేసినట్టు చేసి చేతులు దులుపుకుంటున్న పాపం మిమ్మల్ని నిరంతరం శాపంలా వెంటాడటం ఖాయమన్నారు. ‘ఇప్పటికే రూ.50 వేల కోట్లతో చేయాల్సిన రూ.2 లక్షల రుణ మాఫీని చారాణా కూడా చేయకుండా అధికారంలోకి రాగానే అన్నదాత గొంతుకోశావు.. 72 సార్లు నీ ఢిల్లీ టూర్లకు, పనికిరాని ఈ పబ్లిక్ మీటింగ్‌లకు పెడుతున్న రూ.కోట్ల ఖర్చును ఆదా చేసి ఉంటే రైతులకు పెట్టుబడి సాయం దక్కేది’ అని వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా యూరియా దొరకక అల్లాడుతున్న అన్నదాతల కష్టాల నుంచి అటెన్షన్ డైవర్షన్ చేసే ఈ దిక్కుమాలిన చర్యలు ఏమాత్రం పనిచేయవని గుర్తుపెట్టుకోవాలన్నారు. కేంద్రం ఎంత కొంటే అంతే కొంటామని పంట కొనుగోళ్ల బాధ్యత నుంచి పూర్తిగా తప్పుకున్న చేతకానితనాన్ని చూసి అన్నదాతలు పట్టలేని కోపంతో రగిలిపోతున్నారని తెలిపారు. కేసీఆర్ ఠంచన్‌గా 11 సార్లు, రూ.73 వేల కోట్లను నేరుగా రైతుల ఖాతాలో వేసి రాష్ట్రంలో వ్యవసాయ విప్లవానికి నాంది పలికారని గుర్తు చేశారు. పదేళ్లు పండగలా సాగిన వ్యవసాయాన్ని దండగలా మార్చి తమకు వెన్నుపోటు పొడుస్తున్న దుర్మార్గాన్ని అన్నదాతలు ఎన్నటికీ క్షమించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. రాష్ట్ర చరిత్రలో రైతు బాంధవుడిగా కేసీఆర్ నిలిస్తే మీరు ఎప్పటికీ రైతు ద్రోహిగానే మిగిలి ఉంటారని గుర్తుపెట్టుకోండి అంటూ కేటీఆర్ విమర్శించారు.

# రైతు భరోసా తొలి విడత నిధుల విడుదల

మొదటిపేజీ తరువాయి

పెట్టుబడి భారాన్ని తగ్గించి వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం తెలిపారు.

**రైతులకు అండగా ప్రభుత్వం**

గత 30 నెలలుగా రైతు సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. వ్యవసాయం నష్టాల బాటలో కాకుండా ఆనందంగా సాగు చేసే పరిస్థితులు కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. రైతులు ఆర్థికంగా బలోపేతం కావడానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూనే ఉంటామని హామీ ఇచ్చారు.

**బీఆర్ఎస్ పాలనపై విమర్శలు**

ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై సీఎం విమర్శలు చేశారు. తెలంగాణ ఏర్పడిన సమయంలో రాష్ట్ర అప్పు రూ.69 వేల కోట్లు ఉండగా, 2023 నాటికి అది రూ.8.11 లక్షల కోట్లకు చేరిందని అన్నారు. గత పదేళ్లలో భారీగా అప్పులు చేసి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దెబ్బతీశారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన అప్పుల భారం ప్రస్తుతం తమ ప్రభుత్వం భరిస్తోందని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఆర్థిక వ్యవహారాల్లో జరిగిన లోపాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయని పేర్కొంటూ, గత ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

# జూలై 2న రాష్ట్ర మంత్రిమండలి సమావేశం

హైదరాబాద్, జూన్ 30:

తెలంగాణ రాష్ట్ర మంత్రిమండలి సమావేశం జూలై 2న నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఆరో అంతస్తులోని మంత్రిమండలి సమావేశ మందిరంలో సమావేశం జరగనుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు.

**అజెండా సమయానికి పంపాలి**

మంత్రిమండలి సమావేశంలో చర్చించాల్సిన అంశాలకు సంబంధించిన అజెండాను తెలుగు అనువాదంతో సిద్ధం చేసి, సర్క్యులేషన్ ద్వారా ఆమోదం పొందిన అనంతరం జూలై 1 మధ్యాహ్నం ఒంటి గంటలోపు సాధారణ పరిపాలన శాఖ మంత్రిమండలి విభాగానికి పంపాలని అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

**అధికారులకు ప్రత్యేక సూచనలు**

ఏదైనా శాఖకు అజెండా అంశాలు లేకపోయినా 'నిల్' నివేదికను నిర్ణీత గడువులోగా పంపాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. అలాగే మంత్రిమండలి సమావేశం జరిగే సమయంలో అన్ని శాఖల అధికారులు ప్రధాన కార్యాలయంలో అందుబాటులో ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. సమావేశంలో ప్రభుత్వానికి సంబంధించిన కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

# రూ.45 లక్షల ఉద్యోగం వదిలి.. చివరకు సున్నాకే

- **స్టార్టప్‌ల కోసం భారీ వేతనాన్ని త్యాగం చేసిన యువకుడి ఆవేదన**
- **రెండు వ్యాపారాలు విఫలమై జీవితకాల పొదుపు కోల్పోయిన టెక్ నిపుణుడు**
- **ఆర్థిక నష్టం కంటే ఆత్మవిశ్వాసం కోల్పోవడమే పెద్ద దెబ్బని వ్యాఖ్య**
- **మళ్లీ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్నా వెంటాడుతున్న భయం**

న్యూఢిల్లీ, జూన్ 30:

భారీ వేతనంతో కూడిన ఉద్యోగాన్ని వదిలి సొంతంగా వ్యాపారం ప్రారంభించాలని కలలు కనే యువతకు ఓ టెక్ నిపుణుడి అనుభవం ఆలోచింపజేస్తోంది. ఏడాదికి రూ.45 లక్షల వేతనం వచ్చే ఉద్యోగాన్ని వదిలి రెండు స్టార్టప్‌లు ప్రారంభించిన ఓ యువకుడు, అవి విఫలం కావడంతో తన జీవితకాల పొదుపు మొత్తాన్ని కోల్పోయిన విషయాన్ని సామాజిక మాధ్యమం వేదికగా వెల్లడించాడు.

**కలల ప్రయాణం.. చేదు ముగింపు**

తన కలల సంస్థను నిర్మించాలనే లక్ష్యంతో ఉద్యోగానికి రాజీనామా చేసి ఒకేసారి రెండు వ్యాపారాలు ప్రారంభించానని యువకుడు తెలిపాడు. అయితే అనుకున్న విధంగా ఏ వ్యాపారం కూడా నిలదొక్కుకోలేకపోయిందని, చివరకు పొదుపు మొత్తం ఖర్చై మళ్లీ మొదటి స్థితికి చేరుకున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రస్తుతం తన వద్ద డబ్బు లేదని, వ్యాపారం లేదని, చెప్పుకోదగ్గ గుర్తింపు కూడా మిగల్లేదని పేర్కొన్నాడు.

**ఆత్మవిశ్వాసానికే పెద్ద దెబ్బ**

డబ్బు కోల్పోవడం కంటే తనపై తనకు ఉన్న నమ్మకం దెబ్బతినడమే ఎక్కువ బాధ కలిగించిందని యువకుడు తెలిపాడు. తాను నిజంగా కష్టపడ్డానా అనే సందేహం కూడా కలుగుతోందని, ప్రస్తుత పరిస్థితి తనను తీవ్ర నిరాశకు గురిచేసిందని చెప్పాడు. ప్రస్తుతం మళ్లీ ఉద్యోగం కోసం ప్రయత్నించాలని నిర్ణయించుకున్నప్పటికీ, ఇంటర్వ్యూలకు వెళ్లాలంటే భయంగా అనిపిస్తోందని వెల్లడించాడు. "విఫలమైన నన్ను ఏ సంస్థ ఉద్యోగంలోకి తీసుకుంటుంది" అనే ఆలోచనే తనను వెనక్కి లాగుతోందని, దాని వల్ల ఇంటర్వ్యూలకు సిద్ధమయ్యే ధైర్యం కూడా రావడం లేదని తన మనసులోని బాధను పంచుకున్నాడు.

# అసోంలో భారీ ఆపరేషన్

గౌహతి,జూన్ 30 :

అస్సాం పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు. అర్ధరాత్రి అక్రమంగా తరలిస్తున్న 37 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ దాదాపు రూ.55 కోట్లకు పైనే ఉంటుందని పోలీసులు వెల్లడించారు. బహుశా అస్సాం పోలీస్ చరిత్రలోనే ఇంతపెద్ద మొత్తంలో బంగారం సీజ్ చేసిన ఘటన ఇదే కావొచ్చని డీసీపీ శాంభవి మిశ్రా తెలిపారు. గువాహటిలో అక్షయ్ బన్సోడే (32) అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. బంగారం అక్రమ రవాణాపై నిఘా వర్గాల నుంచి సమాచారం అందడంతో ఈ ఆపరేషన్ చేపట్టాం. 24 క్యారెట్ల బంగారు కడ్డీలతో పాటు దాదాపు 13 గ్రాముల బరువు ఉన్న వెండి ముక్కలు స్వాధీనం చేసుకున్నాం అని ఆమె తెలిపారు. ఈ ముఠాకు అంతర్జాతీయ గోల్డ్ స్మగ్లింగ్ ముఠాతో సంబంధం ఉన్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇదొక భారీ అంతర్జాతీయ స్మగ్లింగ్ ముఠాకు సంబంధించినదిగా తెలుస్తోందని పోలీసులు తెలిపారు. బన్సోడే గతంలో మూడుసార్లు 20 కిలోల బంగారాన్ని అక్రమంగా తరలించాడని, తాజాగా నాలుగోసారి తరలిస్తుండగా పట్టుబడినట్లు పేర్కొన్నారు.

# మంత్రి శ్రీధర్ బాబు టార్గెట్

హైదరాబాద్, జూన్ 30:



తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును లక్ష్యంగా చేసుకుని కృత్రిమ మేధ సాంకేతికతతో రూపొందించిన మార్ఫింగ్ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కావడం కలకలం రేపుతోంది. మంత్రి శ్రీధర్ బాబు, ఆయన సతీమణి, సీనియర్ ఐఏఎస్ అధికారి శైలజా రామయ్యర్‌కు సంబంధించిన నకిలీ వీడియోలను ప్రచారం చేస్తూ వారి ప్రతిష్ఠకు భంగం కలిగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై మంత్రి తరఫు న్యాయవాది ఫిర్యాదు చేయడంతో సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**ఏఐతో దుష్ప్రచారం**

మంత్రి దంపతులను లక్ష్యంగా చేసుకుని ఏఐ సాంకేతికతతో నకిలీ వీడియోలను రూపొందించి ఫేస్‌బుక్‌తో పాటు ఇతర సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్నారని న్యాయవాది శశిభూషణ్ కాశే తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉన్నత పదవుల్లో ఉన్న వ్యక్తుల పరువును దెబ్బతీయాలనే ఉద్దేశంతో ఈ వీడియోలను ప్రచారం చేస్తున్నారని, ఇందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

**కాళేశ్వరం అంశంతో ప్రచారం**

ప్రతిష్ఠాత్మక కాళేశ్వరం ప్రాజెక్టు నిధుల వ్యవహారంతో ముడిపెట్టి మంత్రి శ్రీధర్ బాబును తప్పుడు రీతిలో చూపిస్తూ మార్ఫింగ్ వీడియోలను సృష్టించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బీఆర్ఎస్ మంథని పేరుతో ఉన్న ఫేస్‌బుక్ పేజీతో పాటు మరికొన్ని సామాజిక మాధ్యమ ఖాతాల ద్వారా ఈ వీడియోలను ప్రచారం చేస్తున్నట్లు ఆరోపించారు. దీనికి సంబంధించిన ఆధారాలను కూడా పోలీసులకు సమర్పించినట్లు తెలిపారు.

న్యాయవాది ఫిర్యాదు ఆధారంగా సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నకిలీ వీడియోలను రూపొందించి ప్రచారం చేసిన వ్యక్తులను గుర్తించడంతో పాటు వాటి వెనుక ఉన్న ముఠాపై విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం.

# ఏరోస్పేస్ రాజధానిగా తెలంగాణ

మొదటిపేజీ తరువాయి

ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన ఏరోమార్ట్ హైదరాబాద్2026 అంతర్జాతీయ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ బిజినెస్ కన్వెన్షన్ ప్రారంభోత్సవంలో మంత్రి మాట్లాడుతూ ప్రపంచ ఏరోస్పేస్ రంగం ఇప్పుడు తెలంగాణ వైపు చూస్తోంది.. పెట్టుబడులు, పరిశ్రమలు, అత్యాధునిక సాంకేతికతకు తెలంగాణే కొత్త చిరునామా అని స్పష్టం చేశారు. భారత వైమానిక దళంలో పైలట్‌గా పనిచేసిన అనుభవాన్ని గుర్తు చేసుకుంటూ సూపర్‌సోనిక్ యుద్ధ విమానాలను నడిపిన వ్యక్తిగా ఏరోస్పేస్ రంగంలో నాణ్యత, ఖచ్చితత్వం ఎంత కీలకమో ప్రత్యక్ష అనుభవం ఉందన్నారు. అమెరికా అధ్యక్షుడి హెలికాప్టర్‌కు అవసరమైన క్యాబిన్లు, అపాచీ యుద్ధ హెలికాప్టర్ల నిర్మాణ భాగాలు, ఎఫ్16 యుద్ధ విమానాల రెక్కలు, ప్రపంచ ప్రఖ్యాత ఏరో ఇంజిన్ విడిభాగాలు, ఎంఆర్‌వో వ్యవస్థలు నేడు తెలంగాణలోనే తయారవుతున్నాయని తెలిపారు. మేడ్ ఇన్ తెలంగాణ అనే ముద్ర ఇప్పుడు ప్రపంచ ఆకాశంలో గర్వంగా ఎగురుతోంది అని పేర్కొన్నారు. స్పెయిన్‌కు చెందిన ఐటీపీ ఏరో, కెనడాకు చెందిన ఎఫ్‌టీజీ ఏరోస్పేస్ వంటి అంతర్జాతీయ దిగ్గజాలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడం రాష్ట్ర పారిశ్రామిక విశ్వసనీయతకు నిదర్శనమన్నారు. ఫ్రాన్స్, ఇటలీ సహా 25కిపైగా దేశాల కంపెనీలు ఏరోమార్ట్‌లో పాల్గొనడం తెలంగాణ అంతర్జాతీయ ప్రాధాన్యతను మరింత పెంచిందని తెలిపారు. తెలంగాణలో ఇప్పటికే 1,500కుపైగా ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలకు సేవలందిస్తున్న ఎంఎస్ఎంఈలు పనిచేస్తున్నాయని, పరిశ్రమలకు అవసరమైన అత్యాధునిక పారిశ్రామిక పార్కులు, ప్రత్యేక ఆర్థిక మండళ్లు, ప్లగ్అండ్‌ప్లే మౌలిక సదుపాయాలు రాష్ట్రాన్ని దేశంలోనే అత్యంత ఆకర్షణీయ పెట్టుబడి గమ్యస్థానంగా మార్చాయని చెప్పారు. డీఆర్‌డీవో, రక్షణరంగ ప్రభుత్వ సంస్థలు, పరిశోధనా కేంద్రాలు, ప్రైవేట్ పరిశ్రమలు ఒకే నగరంలో ఉండటం హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి పోటీ సామర్థ్యాన్ని కల్పించాయన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా మారుతున్న ఐటీఐలు ప్రపంచస్థాయి ఏరోస్పేస్ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యంతో కూడిన యువతను తీర్చిదిద్దుతున్నాయని తెలిపారు. తెలంగాణ ఏరోస్పేస్, డిఫెన్స్ రంగం కొన్నేళ్లుగా 30 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేయగా గత ఏడాది ఎగుమతులు 103 శాశానికి పెరిగి రాష్ట్రానికి అగ్రగామిగా ఉన్న ఔషధ రంగాన్నే అధిగమించడం రాష్ట్ర పారిశ్రామిక చరిత్రలో ఒక సువర్ణాధ్యాయమని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విమానయాన రంగ విస్తరణకు చారిత్రక నిర్ణయాలు తీసుకుందని వెల్లడించారు. వరంగల్ విమానాశ్రయానికి వచ్చే నెలలో శంకుస్థాపన, ఆదిలాబాద్‌లో పౌరసైనిక అవసరాలకు అనువైన ఎయిర్‌ఫీల్డ్, కొత్తగూడెం విమానాశ్రయానికి త్వరలో ఆమోదం లభించనున్నాయని తెలిపారు. ఈ మూడూ భవిష్యత్తులో విమాన మరమ్మతు, విమాన తయారీ, రక్షణ పరిశ్రమలకు భారీ అవకాశాలను తెరవనున్నాయన్నారు. ప్రపంచ ఏరోస్పేస్ దిగ్గజాలను ఉద్దేశించి మాట్లాడుతూ మీ తదుపరి తయారీ కేంద్రం తెలంగాణ కావాలి.. మీ తదుపరి పెట్టుబడి హైదరాబాద్‌లో ఉండాలి అన్నారు. ‘ఏరోమార్ట్ హైదరాబాద్2026 ఒక పారిశ్రామిక సదస్సు మాత్రమే కాదు.. ప్రపంచ ఏరోస్పేస్ పటంలో తెలంగాణ శాశ్వత స్థానాన్ని ఖరారు చేసే చారిత్రక వేదిక’ అని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు.

# ప్రత్యేక పోలీస్ బలగాలు రాష్ట్ర భద్రతకు బలమైన కవచం

**మొదటిపేజీ తరువాయి**

పాల్గొని వివిధ పరిపాలనా, సాంకేతిక, సంక్షేమ అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. సమావేశానికి ముందు డీజీపీ ప్రధాన కార్యాలయంలోని వివిధ విభాగాలు, పరిపాలనా సెక్షన్లు, కమ్యూనికేషన్ వ్యవస్థ, ఆయుధాల నిర్వహణ, సాంకేతిక విభాగాలు, నిర్మాణ పనులు, కార్యాలయ నిర్వహణ, ఇతర మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం అధికారులు సమర్పించిన ప్రజెంటేషన్‌ను పరిశీలించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. బెటాలియన్లలో ఖాళీగా ఉన్న పోస్టులను త్వరితగతిన భర్తీ చేయడం, అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడం, వాహనాల సంఖ్యను పెంచడం, సిబ్బందికి మెరుగైన నివాస క్వార్టర్లు, తాగునీరు, వైద్య సదుపాయాలు, ఇతర సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ (ఏపీఎస్పీ) బెటాలియన్లు నక్సల్స్ ఉద్యమం తీవ్రంగా ఉన్న సమయంలో సివిల్ పోలీసులకు వెన్నుదన్నుగా నిలిచి ఎన్నో కీలక ఆపరేషన్లలో విశేష సేవలు అందించాయని గుర్తు చేశారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రతి పోలీస్ స్టేషన్‌కు ప్రత్యేక బలగాలను అనుసంధానం చేయడం ద్వారా పోలీసు వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేసిందన్నారు. తాను నిజామాబాద్, వరంగల్ వంటి నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో జిల్లాల ఎస్పీగా పనిచేసిన సమయంలో ప్రత్యేక బలగాల సేవలను ప్రత్యక్షంగా చూశానని తెలిపారు. ఆ సమయంలో పోలీస్ స్టేషన్లపై తరచూ నక్సల్స్ దాడులు జరిగేవని, అలాంటి పరిస్థితుల్లో స్పెషల్ పోలీస్ బెటాలియన్లు అత్యంత ధైర్యసాహసాలతో విధులు నిర్వహించి నక్సల్స్ నిర్మూలనలో కీలక పాత్ర పోషించాయని ప్రశంసించారు. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ ప్రభుత్వం 13 స్పెషల్ బెటాలియన్లను ఏర్పాటు చేసి రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా వాటిని అభివృద్ధి చేసిందని తెలిపారు. ప్రస్తుతం ఈ బెటాలియన్లు ఎన్నికల సమయంలో భారీ బందోబస్తు, శాంతిభద్రతల నిర్వహణ, ముఖ్యమైన ఉత్సవాలు, మతపరమైన వేడుకలు, ప్రజాసమావేశాలు, వీఐపీ భద్రత, విపత్తు నిర్వహణ, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజల రక్షణలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నాయని కొనియాడారు. ఇటీవల నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో కురిసిన భారీ వర్షాల సమయంలో తెలంగాణ స్పెషల్ బెటాలియన్ సిబ్బంది వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, సహాయక చర్యల్లో పాల్గొనడం, ప్రాణాలు, ఆస్తులను కాపాడడంలో అంకితభావంతో పనిచేశారని అభినందించారు. బెటాలియన్ల కమాండెంట్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొంటూ, పరిపాలనలో క్రమశిక్షణతో పాటు మానవతా దృక్పథం కూడా ఉండాలని సూచించారు. సిబ్బంది కుటుంబ పరిస్థితులు, ఆరోగ్యం, పిల్లల విద్య, వ్యక్తిగత సమస్యలను తెలుసుకుంటూ వారికి అండగా నిలవాలని చెప్పారు. దూర ప్రాంతాల్లో నెలల తరబడి విధులు నిర్వహించే సిబ్బందికి కుటుంబ సభ్యుల నుంచి దూరంగా ఉండటం వల్ల మానసిక ఒత్తిడి ఏర్పడే అవకాశం ఉంటుందని, అలాంటి పరిస్థితుల్లో అధికారులు వారికి అవసరమైన మానసిక బలం అందించాలని సూచించారు. డ్యూటీల కేటాయింపులో పూర్తి పారదర్శకత పాటించాలని, ఎలాంటి వివక్షకు తావివ్వకుండా అందరికీ సమాన అవకాశాలు కల్పించాలని స్పష్టం చేశారు. ఎన్నికలు, ప్రత్యేక బందోబస్తు, వీఐపీ విధులు, ఇతర ప్రత్యేక డ్యూటీలను కూడా నిష్పాక్షికంగా కేటాయించాలని ఆదేశించారు. ప్రతి బెటాలియన్ పనితీరును క్రమం తప్పకుండా సమీక్షిస్తూ, సమగ్ర రివ్యూ నిర్వహించాలని సూచించారు. భవిష్యత్తులో రాష్ట్ర అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఫ్యూచర్ సిటీ, ఆమనగల్ ప్రాంతాల్లో కొత్త స్పెషల్ బెటాలియన్ల ఏర్పాటు అవకాశాలను కూడా పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. పోలీసు సిబ్బందిలో మానసిక ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలంటూ, 'మిత్ర' కౌన్సెలింగ్ కేంద్రాలను మరింత సమర్థంగా వినియోగించాలని సూచించారు. విధుల ఒత్తిడి, కుటుంబ సమస్యలు, వ్యక్తిగత ఇబ్బందులతో బాధపడుతున్న సిబ్బందిని గుర్తించి వారికి నిపుణుల ద్వారా కౌన్సెలింగ్ అందించాలని ఆదేశించారు. పోలీసు సిబ్బంది డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్, ఇతర వ్యసనాల బారిన పడకుండా అధికారులు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అలాంటి అలవాట్లకు గురైన వారిని శిక్షించడం కంటే ముందుగా గుర్తించి, కౌన్సెలింగ్, వైద్య సహాయం ద్వారా తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. పోలీసు సిబ్బందిలో ఆత్మహత్యల నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, వారి ప్రవర్తనలో వచ్చే మార్పులను అధికారులు, సహచరులు ముందుగానే గుర్తించి తక్షణమే స్పందించాలని సూచించారు. ప్రతి కమాండెంట్ తన పరిధిలోని సిబ్బందితో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ పరిష్కరించే దిశగా పనిచేయాలని చెప్పారు. శిక్షణకు ఎల్లప్పుడూ అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని, ఆధునిక పోలీసింగ్‌కు అనుగుణంగా ప్రత్యేక శిక్షణ కేంద్రాలను మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, ఆయుధ వినియోగం, విపత్తు నిర్వహణ, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, శారీరక దారుఢ్యం, మానసిక దృఢత్వంపై నిరంతర శిక్షణ అందించాలని సూచించారు. స్పెషల్ బెటాలియన్లు రాష్ట్ర పోలీసు వ్యవస్థకు వెన్నెముక వంటివని పేర్కొన్న డీజీపీ, భవిష్యత్తు సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేలా ఆధునికీకరణ, క్రమశిక్షణ, సాంకేతికత, సిబ్బంది సంక్షేమం అనే నాలుగు ప్రధాన లక్ష్యాలతో ముందుకు సాగాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై విద్యార్థులకు ఊరట

**మొదటిపేజీ తరువాయి**

తేదీకి వాయిదా వేసింది. ఈ కేసులో గత విచారణ సందర్భంగా జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులు అప్పటివరకు కొనసాగుతాయని న్యాయస్థానం స్పష్టం చేసింది. గత విచారణలో విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ముఖ్యంగా విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయరాదని పేర్కొంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 9లోని నాలుగు నిబంధనల అమలుపై తాత్కాలికంగా స్టే విధించింది. హైకోర్టు జారీ చేసిన ఈ మధ్యంతర ఉత్తర్వులు 6వ తేదీ జరిగే తదుపరి విచారణ వరకు అమల్లో ఉంటాయని న్యాయస్థానం స్పష్టం చేసింది. దీంతో సంబంధిత విద్యాసంస్థలు, విద్యార్థులు, తల్లిదండ్రుల్లో నెలకొన్న అనిశ్చితికి తాత్కాలిక ఉపశమనం లభించినట్లైంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానానికి సంబంధించిన వివిధ అంశాలపై పిటిషనర్లు కోర్టును ఆశ్రయించిన విషయం విదితమే. ఈ క్రమంలో ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోలోని కొన్ని నిబంధనలపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసింది. జులై 6వ తేదీ జరగనున్న తదుపరి విచారణలో ప్రభుత్వం, పిటిషనర్ల వాదనలను పరిశీలించనుంది. అనంతరం హైకోర్టు మరిన్ని ఆదేశాలు జారీ చేసే అవకాశం ఉంది. ఈ కేసు తీర్పు రాష్ట్రంలోని వేలాది మంది విద్యార్థులు, విద్యాసంస్థలపై ప్రభావం చూపే అవకాశముండటంతో ఆసక్తి నెలకొంది.

## కాంగ్రెస్ ఢిల్లీ దర్బార్‌కు ఏటీఎంగా తెలంగాణ

**మొదటిపేజీ తరువాయి**

ఎలా గెలిచారని చాలా మంది నన్ను అడుగుతున్నారు. కార్యకర్తల కష్టాలతో పశ్చిమ బెంగాల్‌లో గెలిచామని చెప్పాను. అక్కడ పార్టీ కార్యకర్తలను చాలా ఇబ్బందులకు గురిచేశారు.. అయినా లెక్కచేయకుండా బీజేపీని గెలిపించాలనే ఆలోచనతో వారు పనిచేశారు. అని కొనియాడారు. 'సర్'పై ప్రజలకు బీజేపీ కార్యకర్తలు అవగాహన కల్పించాలన్నారు. తెలంగాణలో 'సర్'పై ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఇక్కడినుంచి ఢిల్లీకి డబ్బులు వెళ్తున్నాయి.. ఢిల్లీ దర్బార్‌కు తెలంగాణ ఏటీఎంగా మార్చారు. తెలంగాణలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు ఇచ్చింది.. కానీ ఒక్కటికూడా పూర్తి చేయలేదు. కాంగ్రెస్.. అవినీతి, నేరాల తరహా పాలన చేస్తున్నారు. కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్ కలిసే ఉన్నాయి. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు ఇంకా అన్యాయం జరుగుతూనే ఉందని నితిన్ నన్నారు.న్ ఆరోపించారు. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు సమావేశంలో పాల్గొన్నారు.

## యాదగిరిగుట్ట దేవస్థానానికి కొత్త పాలక మండలి

- **చైర్మన్‌గా ఎం. సత్యనారాయణ రెడ్డి.. సభ్యురాలిగా కొణిదెల సురేఖకు చోటు**

**హైదరాబాద్, జూన్ 30 :**

తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి నూతన పాలక మండలిని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ చారిటబుల్ అండ్ హిందూ రిలీజియస్ ఇన్‌స్టిట్యూషన్స్ అండ్ ఎండోమెంట్స్ చట్టం ప్రకారం కొత్త బోర్డును నియమించింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్ ఉత్తర్వులు విడుదల చేశారు.

నూతన పాలక మండలి చైర్మన్‌గా ఎం. సత్యనారాయణ రెడ్డిని ప్రభుత్వం నియమించింది. చైర్మన్‌తో పాటు సభ్యులు, ఎక్స్‌అఫీషియో సభ్యులతో కలిపి మొత్తం 18 మందికి బోర్డులో స్థానం కల్పించింది. సభ్యులుగా వినోద్ వెంకటస్వామి, ఎమ్మెల్యే సురేఖ, చిలపగారి విజయరాజం, విజయేందర్ తుల్లా, పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, గుండు మల్లయ్య, స్వాతి కాంతమణి, ఎం. రాఘవేందర్ రావు, డాక్టర్ లక్ష్మీనారాయణ నియమితులయ్యారు. మెగాస్టార్ చిరంజీవి సతీమణి కొణిదెల సురేఖకు కూడా బోర్డులో సభ్యురాలిగా అవకాశం కల్పించడం విశేషంగా మారింది. ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ (దేవాదాయ) శాఖ ప్రధాన కార్యదర్శి, దేవాదాయ శాఖ కమిషనర్, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్, యాదగిరిగుట్ట టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ ఉపాధ్యక్షుడు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి, సీనియర్ ప్రధాన అర్చకులు కొనసాగనున్నారు.

ఎక్స్‌అఫీషియో సభ్యులు, ఫౌండర్ ట్రస్టీ మినహా చైర్మన్, నామినేటెడ్ సభ్యుల పదవీకాలం బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి రెండేళ్ల పాటు లేదా తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు అమల్లో ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. నూతన చైర్మన్, సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించే బాధ్యతను దేవస్థానం కార్యనిర్వహణాధికారికి అప్పగించింది.

## తెలంగాణ నూతన పీసీసీఎఫ్‌గా వినయ్ కుమార్ బాధ్యతల స్వీకరణ

**హైదరాబాద్, జూన్ 30 :**

తెలంగాణ అటవీ శాఖ నూతన ప్రధాన అటవీ సంరక్షణాధికారి (పీసీసీఎఫ్, హెచ్‌ఓఎఫ్ఎఫ్)గా 1992 బ్యాచ్ ఐఎఫ్ఎస్ అధికారి వినయ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం హైదరాబాద్‌లోని అరణ్య భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పదవీ విరమణ చేసిన మాజీ పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణకు అటవీ శాఖ అధికారులు, ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు పలికారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో డాక్టర్ సువర్ణ మాట్లాడుతూ, అటవీ శాఖలో సేవలందించే అవకాశం లభించడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. దాదాపు 35 ఏళ్ల సేవాకాలంలో వివిధ హోదాల్లో పనిచేయడం సంతృప్తినిచ్చిందన్నారు. తన పదవీకాలంలో శాఖ ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చామని, సుమారు 300 మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడం ప్రత్యేక సంతృప్తిని కలిగించిందని తెలిపారు. తనకు సహకరించిన అధికారులు, ఉద్యోగులు,




సిబ్బందికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

నూతన పీసీసీఎఫ్ వినయ్ కుమార్ మాట్లాడుతూ, తెలంగాణలో పర్యావరణ పర్యాటకాన్ని విస్తరించడంతో పాటు హరిత నిధి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తామని చెప్పారు. రాష్ట్ర అటవీ సంపద పరిరక్షణ, అభివృద్ధితో పాటు ప్రజల భాగస్వామ్యాన్ని పెంచే దిశగా కార్యాచరణ కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ ఉన్నతాధికారులు, వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి బండికి ఊరట

- **హుజూరాబాద్ ఉప ఎన్నికల కేసు కొట్టివేత**

**హైదరాబాద్, జూన్ 30:**

హుజూరాబాద్ ఉప ఎన్నికల సమయంలో నమోదైన కేసులో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ఊరట లభించింది. ఈ కేసును విచారించిన నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు బండి సంజయ్‌పై నమోదైన కేసును కొట్టివేసింది. హుజూరాబాద్ ఉప ఎన్నికల సందర్భంగా అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీ ఓటుకు రూ.25 వేల వరకు ఇస్తోందని బండి సంజయ్ ఆరోపించారు. అలాగే ఓటర్లకు రూ.5 వేల చొప్పున ఇచ్చి, మిగిలిన మొత్తాన్ని బీఆర్ఎస్ కార్యకర్తలు పంచుకుంటున్నారని కూడా ఆయన వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో హుజూరాబాద్



పోలీసులు బండి సంజయ్‌పై ఐపీసీ సెక్షన్లు 188, 171సీ, 505(2)తో పాటు ప్రజాప్రాతినిధ్య చట్టం1951లోని సెక్షన్ 123(3ఏ) కింద కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో కేసును విచారించిన నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు కేసును కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది.

## అబద్ధపు ప్రచారాలను తిప్పికొట్టాలి

**హైదరాబాద్, జూన్ 30:**

"పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించి, అప్పుల ఊబిలోకి నెట్టిన మాజీ పాలకులకు రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు. రాష్ట్రంపై బావ, బామ్మర్దులు (కేటీఆర్, హరీష్ రావు) అడ్డగోలుగా అబద్ధపు కట్టుకథలు అల్లుతూ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని రైతాంగం తిప్పికొట్టాలి" అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. మంగళవారం హైదరాబాద్ శిల్పకళా వేదికలో జరిగిన రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమంలో ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడారు. పది సంవత్సరాల ఆనాటి పాలనలో మంత్రులుగా పనిచేసిన హరీష్‌రావు, కేటీఆర్ ఈరోజు బావ, బామ్మర్దులుగా కలిసి రోజుకో అబద్ధాన్ని సృష్టిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. పదేళ్లు మంత్రిగా పనిచేశాక కూడా బాధ్యతారహితంగా మాట్లాడుతున్న తీరు బాధాకరం" అని ఆయన విమర్శించారు. ప్రభుత్వంపై అడ్డగోలుగా ఆరోపణలు చేయడం మానుకోవాలని ఆయన హితవు పలికారు. గత ప్రభుత్వ హయాంలో రైతుల కోసం జరిగిన ఖర్చుతో పోలిస్తే, తమ ప్రభుత్వం ఎంతో నిబద్ధతతో పనిచేస్తుందని గణాంకాలతో సహా వివరించారు. "గత ప్రభుత్వం పదేళ్లలో రైతుల కోసం కేవలం 2,88,670 కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు చేసింది. అంటే నెలకు సగటున 2,532 కోట్లు, ఏడాదికి 30,364 కోట్లు మాత్రమే వెచ్చించారు. కానీ, మా కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రెండున్నర ఏళ్లలోనే 1,56,496 కోట్ల రూపాయలను రైతుల కోసం ఖర్చు చేసింది. అంటే నెలకు 5,217 కోట్ల చొప్పున, ఏడాదికి 62,604 కోట్ల రూపాయలను రైతు సంక్షేమం కోసం వెచ్చిస్తున్నాం. ఇది గత పాలకులు ఖర్చు చేసిన దానికంటే రెట్టింపు" అని ఆయన స్పష్టం చేశారు. గత పాలకులు తెచ్చిన 8 లక్షల కోట్ల అప్పుల భారాన్ని తమ ప్రభుత్వం మోస్తోందని గుర్తు చేశారు. ఆ అప్పులకు సంబంధించి కేవలం రెండున్నర ఏళ్లలోనే 2,08,557 కోట్ల రూపాయలను బ్యాంకుల వడ్డీలు, అసలు చెల్లింపులకే ఖర్చు చేశామని తెలిపారు. ఆర్థికంగా ఇన్ని చిక్కులున్నా, ఎక్కడా వెనకడుగు వేయకుండా రైతు సంక్షేమాన్ని కొనసాగిస్తున్నామని ఆయన చెప్పారు.

## తెలంగాణలో డేటా సెంటర్ల విస్తరణపై సీఎం దృష్టి

**హైదరాబాద్, జూన్ 30 :**

తెలంగాణలో చందన్‌వెల్లి డేటా సెంటర్ ప్రాజెక్టును వీలైనంత త్వరగా ప్రారంభించాలని, రాష్ట్రంలో మరింత పెద్ద సమగ్ర డేటా సెంటర్, కృత్రిమ మేధ మౌలిక సదుపాయాల క్యాంపస్ ఏర్పాటు అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, భారతీ ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్ సునీల్ భారతి మిట్టల్ మంగళవారం ఎంసీఆర్‌హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణలో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంస్కరణలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని సీఎం వివరించారు. విద్యా రంగంలో చేపట్టిన సంస్కరణలు, ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణ, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్యాలు కల్పించేందుకు ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఐటీఐలను అధునాతన సాంకేతిక కేంద్రాలుగా తీర్చిదిద్దడం, పాలిటెక్నిక్ కళాశాలల ఆధునికీకరణ వంటి కార్యక్రమాలను వివరించారు. హైదరాబాద్‌ను డిజిటల్, క్లౌడ్, సైబర్ భద్రత, కృత్రిమ మేధ రంగాల్లో కీలక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఎయిర్‌టెల్ మరింత దృష్టి సారించాలని సీఎం సూచించారు. భవిష్యత్ పెట్టుబడులు, సమస్యల పరిష్కారంలో తెలంగాణ ప్రభుత్వంతో సమన్వయం కోసం ఒక సీనియర్ అధికారిని నియమించాలని కోరారు. ఈ సందర్భంగా సునీల్ భారతి మిట్టల్ మాట్లాడుతూ, భారతీ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఏటీసీల్లో చదివే విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేస్తామని తెలిపారు. ఎయిర్‌టెల్‌కు రెండో ప్రధాన కార్యాలయంగా హైదరాబాద్‌ను పరిగణిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో డేటా సెంటర్ల సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు సిద్ధంగా ఉన్నామని, ఫైబర్ అనుసంధానాన్ని విస్తరించడంపైనా ఆసక్తి ఉందని వెల్లడించారు.



## ఔటర్ రింగ్ రోడ్డుపై కాల్పుల కలకలం

**హైదరాబాద్, జూన్ 30:**

హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై కాల్పుల ఘటన కలకలం రేపింది. ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ నంబర్ 8 సమీపంలో ఈ ఘటన జరిగినట్లు సమాచారం.

ప్రాథమిక సమాచారం ప్రకారం, మోస్ట్ వాంటెడ్ నేరస్థుడిని లక్ష్యంగా చేసుకుని పోలీసులు కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. సదరు నేరస్థుడిపై ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణలోనూ పలు కేసులు నమోదై ఉన్నట్లు సమాచారం. అయితే, ఈ ఘటనపై ఇప్పటివరకు పోలీసుల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. కాల్పులకు దారితీసిన పరిస్థితులు, నిందితుడి పరిస్థితి, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. పోలీసుల అధికారిక ప్రకటన వెలువడిన తర్వాతే ఘటనపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# 3 వేల కుటుంబాలకు ఊరట..

- **పార్కు స్థలం కాపాడిన హైడ్రా**

**హైదరాబాద్, జూన్ 30 :**

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి మండలం బోడుప్పల్ గ్రామ పరిధిలోని టెలిఫోన్ కాలనీలో 1,166 చదరపు గజాల పార్కు స్థలాన్ని హైడ్రా ఆక్రమణల నుంచి రక్షించింది. ఈ చర్యతో కాలనీలో నివసిస్తున్న సుమారు 3 వేల కుటుంబాలు, 10 వేల మందికి పార్కు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంది. 1974లో గ్రామపంచాయతీ లేఅవుట్‌గా టెలిఫోన్ కాలనీ ఏర్పాటైంది. అప్పట్లోనే 1,166 చదరపు గజాల స్థలాన్ని పార్కు కోసం కేటాయించారు. అయితే కాలక్రమంలో ఈ స్థలాన్ని ఆరు భాగాలుగా విభజించి ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నించారు. కాలనీ వాసులు పార్కుగా అభివృద్ధి చేయాలని ప్రయత్నిస్తుండగా, ఆక్రమణదారులు అడ్డంకులు సృష్టిస్తున్నారని నివాసితులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై స్పందించిన హైడ్రా అధికారులు సంబంధిత శాఖలతో కలిసి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. బోడుప్పల్ గ్రామంలోని సర్వే నంబర్లు 78, 79లో ఈ కాలనీ ఉన్నట్లు నిర్ధారించారు. గ్రామపంచాయతీ లేఅవుట్ అయినప్పటికీ ప్లాట్లు, భవనాలకు ఎల్ఆర్ఎస్, బీఆర్ఎస్ అనుమతులు మంజూరైనట్లు గుర్తించారు. పార్కు పక్కన ఉన్న ప్లాట్ల విక్రయ పత్రాలు, ఆమోదిత లేఅవుట్, నమోదిత పత్రాలు, క్షేత్రస్థాయి పరిశీలన, కాలనీ వాసుల వాంగ్మూలాలను పరిశీలించిన అనంతరం 1,166 చదరపు గజాల ఈ స్థలం పూర్తిగా పార్కు స్థలమేనని హైడ్రా తేల్చింది. దీంతో ఆక్రమణదారులు ఏర్పాటు చేసిన అక్రమ కంచెలను తొలగించిన అధికారు



లు, పార్కు స్థలమని సూచిస్తూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేశారు. అలాగే స్థల సరిహద్దులను గుర్తించి కొత్తగా ఫెన్సింగ్ ఏర్పాటు చేసి పార్కు స్థలాన్ని పరిరక్షించారు.

## పోక్సో కేసులో హైకోర్టును ఆశ్రయించిన బండి భగీరథ్

- **బెయిల్ పిటిషన్‌పై నేడు విచారణ**

**హైదరాబాద్, జూన్ 30 :**

తనపై నమోదైన పోక్సో కేసులో బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ బండి భగీరథ్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు తన న్యాయవాదుల ద్వారా బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. బండి భగీరథ్ దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం న్యాయమూర్తి జస్టిస్ కలసికం సుజన నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టనుంది. ఈ విచారణపై రాజకీయ, న్యాయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. బెయిల్ పిటిషన్‌లో కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని, తాను పూర్తిగా నిర్దోషినని భగీరథ్ పేర్కొన్నారు.



తనపై నమోదైన కేసు రాజకీయ ప్రేరేపితమైందని, రాజకీయ ప్రయోజనాల కోసమే తప్పుడు ఆరోపణలు చేశారని వాదించారు. కేసు నమోదైనప్పటి నుంచి దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తున్నానని, పోలీసులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చానని పిటిషన్‌లో వివరించారు. ఈ నేపథ్యంలో తనకు బెయిల్ మంజూరు చేయాలని హైకోర్టును కోరారు.

రాజముద్ర




# పౌరసత్వం అసలు గుర్తింపు ఏది?

**పాస్‌పోర్టు.. ఆధార్ కాదు.. మరి భారతీయుడినని నిరూపించేది ఏమిటి?**

ఇప్పుడు పౌరసత్వానికి గుర్తింపు ఏంటన్న చర్చ జోరుగా సాగుతోంది. పాస్‌పోర్టు కాదన్నారు. ఆధార్ కూడా కాదన్నారు. ఓటరు ఐడి అంతకన్న కాదన్నారు. మరి ఏది మనలను భారతీయులు అని గుర్తించడానికి అన్నది..? దీనికి సమాధానం కనిపించడం లేదు. కాదన్నవారు చెప్పడం లేదు. సర్ ప్రక్రియ సాగుతున్న వేళ దీనిపై పెద్ద దుమారమే లేచింది. పాస్‌పోర్ట్ కూడా కాదన్నప్పుడు ఏది అన్న ప్రశ్న సహజంగానే వస్తోంది. అసలు మన దేశంలో పౌరసత్వాన్ని ఎలా గుర్తిస్తారు? రాజ్యాంగం ఏం చెబుతోంది? పాస్‌పోర్ట్ పౌరసత్వ ధృవీకరణ పత్రం కాకపోతే.. అసలైన గుర్తింపు ఏది? ఎవరు భారతీయులో తేల్చేది ఎవరు వంటి సందేహాలు ఇప్పుడు సామాన్యుల మదిని తొలుస్తున్నాయి. విదేశీ వ్యవహారాల శాఖ ఏం చెప్పింది..మన దేశంలో చాలా మందికి పాస్‌పోర్ట్ ఉంటే అదే అసలైన పౌరసత్వ గుర్తింపు అని ఓ బలమైన నమ్మకం ఉంది. ఎవరైనా విదేశాలకు వెళ్లాలన్నా గుర్తింపు కార్డుగా చూపించాలన్నా అందరికీ ముందుగా గుర్తొచ్చేది పాస్‌పోర్టే. అయితే విదేశీ వ్యవహారాల శాఖ నుంచి వచ్చిన ఓ ప్రకటన ఇప్పుడు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పాస్‌పోర్ట్ కేవలం ప్రయాణ పత్రం మాత్రమేనని.. అది పౌరసత్వానికి నిదర్శనం కాదని ఇటీవల తేల్చి చెప్పింది. ఆధార్ కూడా కేవలం గుర్తింపు కార్డు మాత్రమేనని గతంలోనే తేల్చారు. ఇన్ని ప్రశ్నల మధ్య అసలు ఏంటన్నది కేంద్రమే తేల్చాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వంపైనే ఈ బాధ్యత ఉంది. పాస్‌పోర్ట్ సేవా దివస్ సందర్భంగా విదేశీ వ్యవహారాల శాఖ చేసిన ప్రకటన ఇప్పుడు దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు దారితీసింది. భారతీయులకు పాస్‌పోర్ట్ కేవలం ఒక ట్రావెల్ డాక్యుమెంట్ మాత్రమేనని స్పష్టం చేసింది. ప్రభుత్వ అధికారుల పటిష్టమైన విచారణ తర్వాతే పౌరులకు దీన్ని జారీ చేస్తారు. భారత రిపబ్లిక్ పేరుతో జారీ అయ్యే ఈ పత్రం ప్రపంచవ్యాప్తంగా ఆమోదం పొందుతుంది. అయితే ఇది ఒక వ్యక్తిని భారతీయ పౌరుడిగా గుర్తించేందుకు చట్టబద్ధమైన నిదర్శనం ఎంతమాత్రం కాదు. మిగతా దేశాలతో పోలిస్తే భారత పౌరసత్వ నిర్ధారణలో ఒక పెద్ద సమస్య దాగి ఉంది. అమెరికా, బ్రిటన్ లాంటి దేశాల్లో పౌరులందరికీ ఒకే తరహా యూనివర్సల్ సిటిజన్ షిప్ సర్టిఫికెట్ ఉంటుంది. కానీ మన దేశంలో పౌరులందరికీ ఇచ్చే ఒకే ఒక్క పౌరసత్వ ధృవీకరణ పత్రం అంటూ ఏదీ లేదు. ఎక్కువ మంది భారతీయుల పౌరసత్వం పుట్టుక ఆధారంగానే వస్తుంది. చాలామంది పాతతరం భారతీయులకు ఓటరు జాబితాలు, స్కూల్ సర్టిఫికెట్లు, భూమి రికార్డులే ప్రధాన ఆధారాలు. వీటన్నింటినీ క్రమబద్ధీకరించేందుకే ఎన్నార్సీ అమలును గతంలో ప్రతిపాదించారు. అసోంలో అమలు చేసిన ఎన్నార్సీలో సరైన డాక్యుమెంట్లు లేక దాదాపు 19 లక్షల మంది జాబితాలో చోటు కోల్పోయారు. అందుకే రాజ్యాంగం కల్పించిన పౌరసత్వ నిబంధనల పట్ల సరైన అవగాహన ఉండటం అత్యంత అవసరం. న్యాయపరమైన సవాళ్లు ఎదురైనప్పుడు.. కోర్టుల్లో పాస్‌పోర్ట్ చూపించి పౌరసత్వాన్ని నిరూపించుకోలేరు. భారత పౌరులు ఎవరనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 5 నుంచి 11 వరకు 1955 పౌరసత్వ చట్టం స్పష్టంగా నిర్వచించాయి. ఈ చట్టాల ప్రకారం ఏ ఒక్క పత్రం కూడా పౌరసత్వానికి పూర్తి స్థాయి ఆధారంగా పరిగణించదు. పౌరసత్వం అనేది పుట్టుక.. తల్లిదండ్రుల మూలాలు.. నివాసం ఆధారంగా వచ్చే ఒక చట్టపరమైన హోదా. మన దగ్గర ఉన్న రికార్డులు కేవలం ఆ వాస్తవాలను నిర్ధారించే సాక్ష్యాలుగా మాత్రమే పనిచేస్తాయి. ఉదాహరణకు ఆధార్, ఓటర్ ఐడీ, పాన్ కార్డ్ లాంటివి గుర్తింపు కార్డులు మాత్రమే కానీ అవే పౌరసత్వానికి తుది ఆధారాలు కావు. 1955 పౌరసత్వ చట్టం ప్రకారం పౌరసత్వాన్ని నాలుగు మార్గాల్లో పొందవచ్చు. మొదటిది పుట్టుకతో వచ్చే పౌరసత్వం. 1950 నుంచి 1987 మధ్య భారత్‌లో జన్మించిన వారందరూ సహజంగానే పౌరులు అవుతారు. ఆ తర్వాత 2003 వరకు జన్మించిన వారిలో తల్లిదండ్రుల్లో కనీసం ఒక్కరైనా భారతీయులై ఉండాలి. ఇక రెండో మార్గం వారసత్వం. విదేశాల్లో పుట్టిన పిల్లల తల్లిదండ్రుల్లో ఒకరు భారతీయులై ఉండి.. ఏడాదిలోపు కాన్సులేట్‌లో నమోదు చేసుకుంటే పౌరసత్వం లభిస్తుంది. మూడోది రిజిస్ట్రేషన్ ద్వారా.. నాలుగోది నిర్దిష్ట కాలం దేశంలో ఉండటం ద్వారా పొందే పౌరసత్వం. ఇది కనీసం 12 ఏళ్ల పాటు భారత్‌లో నివసించిన విదేశీయులకు ఇస్తారు. పాకిస్థాన్ సింగర్ అద్నాన్ సమీకి ఇలాగే భారత పౌరసత్వం లభించింది. పౌరులు కాని వారికి పాస్‌పోర్టు ఇవ్వకూడదనే నియమం కూడా ఏమీ లేదు. పాస్‌పోర్ట్ చట్టంలోని సెక్షన్ 20 ప్రకారం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పరిస్థితుల్లో విదేశీయులకు కూడా ట్రావెల్ డాక్యుమెంట్లు జారీ చేయవచ్చు. దేశ ప్రయోజనాల దృష్ట్యా ఈ అధికారాన్ని కేంద్రం ఉపయోగిస్తుంది. రాజకీయ కారణాలతో ఏ దేశం లేని వాళ్లుగా మిగిలిపోయిన వారికి ఇలాంటి వెసులుబాటు ఇస్తారు. భారత్‌లో ఉంటున్న టిబెటన్ శరణార్థులకు, శ్రీలంక తమిళులకు వేరే దేశాలకు వెళ్లేందుకు ప్రత్యేక ప్రయాణ పత్రాలు జారీ చేస్తారు. ఇవన్నీ చూస్తే.. పాస్‌పోర్ట్ ఉంటే వారు పక్కా భారతీయులు అనుకోవడం పొరపాటే అవుతుంది. పౌరసత్వ వివాదాలపై దేశంలోని అత్యున్నత న్యాయస్థానాలు ఎన్నోసార్లు స్పష్టమైన తీర్పులు ఇచ్చాయి. సుప్రీంకోర్టు సహా పలు హైకోర్టులు పాస్‌పోర్టును ఒక గుర్తింపుగా మాత్రమే చూశాయి. ఓటరు నమోదు కోసం ఎన్నికల సంఘం పాస్‌పోర్ట్, జనన ధృవీకరణ పత్రాలను బలమైన సాక్ష్యాలుగా అంగీకరిస్తుంది. కానీ కోర్టులు మాత్రం పౌరసత్వ వివాదాల్లో వీటిని తుది ఆధారాలుగా అంగీకరించవు. పౌరసత్వాన్ని నిరూపించుకునే బాధ్యత పూర్తిగా సదరు వ్యక్తి పైనే ఉంటుందని కోర్టులు తేల్చి చెప్పాయి. దీంతో ఇప్పుడు పౌరసత్వ కార్డులు తీసుకోవాల్సిన అవసరం కూడ ఆ రావచ్చు. దీనికి కూడా కేంద్రం కసరత్తు చేస్తుందా అన్నది చూడాలి. ఆధార్‌ను పరిగణలోకి తీసుకోకుంటే సమగ్రమైన భారతీయతకు సంబంధించిన కార్డు లేదా పత్రం అవసరం ఏర్పడింది.

# ఇథనాల్ కేటాయింపుల వివాదం

- కర్ణాటక హైకోర్టు ఉత్తర్వులపై సుప్రీంకోర్టు 'స్టేటస్ కో'!
- కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన భారత్ పెట్రోలియం కార్పొరేషన్
- హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించకుండా నేరుగా ఇక్కడికి ఎందుకు వచ్చారంటూ పిటిషనర్లను ప్రశ్నించిన సుప్రీంకోర్టు




**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా తీవ్ర ఆసక్తి రేకెత్తిస్తున్న 2025-26 సరఫరా సంవత్సరపు ఇథనాల్ కేటాయింపుల వివాదంలో దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుందని న్యూఢిల్లీ బ్యూరో ప్రత్యేక కథనంలో వెల్లడించింది. ఇథనాల్ సరఫరాకు సంబంధించి గతంలో కర్ణాటక హైకోర్టు జారీ చేసిన ఆదేశాలను సవాలు చేస్తూ ప్రభుత్వ రంగ సంస్థ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) దాఖలు చేసిన అత్యవసర పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టులో సుదీర్ఘ విచారణ జరిగింది. ఈ విచారణ సందర్భంగా బీపీసీఎల్ తరఫున కేంద్ర ప్రభుత్వ అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి హాజరై బలమైన వాదనలను వినిపించారు. పర్యావరణ పరిరక్షణ మరియు ఇంధన రంగ స్వావలంబనలో భాగంగా పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపాలన్న (ఇథనాల్ బ్లెండింగ్) బృహత్తర లక్ష్యానికి కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని ఆయన న్యాయస్థానానికి స్పష్టం చేశారు. పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్‌ను కలిపే ఈ అద్భుతమైన ప్రక్రియ యొక్క పూర్తి స్థాయి సానుకూల ఫలితాలు వచ్చే ఏడాది నాటికే దేశంలో స్పష్టంగా కనిపిస్తాయని ఆయన ధర్మాసనానికి వివరించారు. అయితే కేంద్ర ప్రభుత్వం వినిపించిన ఈ వాదనలపై సుప్రీంకోర్టు స్పందిస్తూ, ఈ వివాదంలో పిటిషనర్లు మొదటగా కర్ణాటక హైకోర్టుకు చెందిన డివిజన్ బెంచ్‌ను ఎందుకు సంప్రదించలేదని, నేరుగా సుప్రీంకోర్టుకు ఎందుకు రావాల్సి వచ్చిందని ప్రశ్నించింది. దీనికి అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి సమాధానమిస్తూ, గడిచిన అక్టోబర్ 2025 నాటికే ఇథనాల్ సరఫరాకు సంబంధించిన అన్ని అధికారిక ఒప్పందాలు పూర్తిగా ముగిసిపోయాయని సుప్రీంకోర్టుకు తెలియజేశారు. ఇటువంటి తరుణంలో ఇప్పుడు మళ్లీ ఈ కేటాయింపుల ప్రక్రియను మొదటికి తీసుకువస్తే దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమానికి తీవ్రమైన ఆటంకాలు ఎదురవుతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే కాకుండా ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఇలాంటి ఇథనాల్ కేటాయింపుల వివాదాలు పలు రాష్ట్రాల హైకోర్టులలో విచారణ దశలో నడుస్తున్నాయని, దీనివల్ల వేర్వేరు కోర్టులు పరస్పర విరుద్ధమైన తీర్పులు ఇచ్చే అవకాశం ఉందని అటార్నీ జనరల్ కోర్టుకు వివరించారు. భవిష్యత్తులో తలెత్తే న్యాయపరమైన చిక్కులను నివారించేందుకు వీలుగా అన్ని రాష్ట్రాల్లో ఉన్న ఈ కేసులన్నింటినీ ఒకే చోటికి బదిలీ చేయాలని ఆయన సుప్రీంకోర్టును అభ్యర్థించారు. కేంద్ర అటార్నీ జనరల్ చేసిన ఈ బదిలీ విజ్ఞప్తిని ప్రైవేట్ కంపెనీల తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దేవ్ తీవ్రంగా వ్యతిరేకించారు. కేసు విచారణను సాధ్యమైనంత వరకు ఆలస్యం చేయడానికే కేంద్ర ప్రభుత్వం ఇలాంటి బదిలీ పిటిషన్ల వ్యూహాన్ని తెరపైకి తెచ్చిందని ఆయన న్యాయస్థానానికి ఫిర్యాదు చేశారు. ఈ విధంగా ఇరు పక్షాల నుంచి వ్యక్తమైన సుదీర్ఘ వాదోపవాదాలను నిశితంగా పరిశీలించిన సుప్రీంకోర్టు, ఈ కేసులో ప్రస్తుతానికి యథాతథ స్థితిని (స్టేటస్ కో) కొనసాగించాలంటూ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ వివాదంపై కోర్టులో తదుపరి విచారణ జరిగేంత వరకు ఈ స్టేటస్ కో ఆదేశాలు దేశవ్యాప్తంగా అమల్లో ఉంటాయని ధర్మాసనం స్పష్టం చేసింది.

# ప్రధాని మోదీకి ఫోన్ చెయ్

**అమెరికా రాయబారి సర్జియో గోర్‌తో డొనాల్డ్ ట్రంప్..**

**ఢిల్లీ, జూన్ 30:** భారత ప్రధాని నరేంద్ర మోదీని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన స్నేహితుడు అంటూ ప్రపంచ వేదికలపై ఇప్పటికే పలుమార్లు చెప్పిన సంగతి తెలిసిందే. తాజాగా వారి మధ్య ఉన్న స్నేహబంధాన్ని తెలియజేసే మరో ఘటన వెలుగులోకి వచ్చింది. అమెరికాలోని మయామీలో ఈ ఏడాది ఏప్రిల్ 11న యూఎఫ్‌సీ 327 ఈవెంట్ జరిగింది. ఈ సందర్భంగా భారత ప్రధాని మోదీకి ఫోన్ చేయాలని డొనాల్డ్ ట్రంప్ అనుకున్నారట. ఈ విషయాన్ని భారత్‌లోని అమెరికా రాయబారి సర్జియో గోర్ తెలిపారు. ఈ అంశాన్ని అమెరికా-భారత్ వ్యూహాత్మక భాగస్వామ్య లీడర్‌షిప్ సమ్మిట్ (యూఎస్ఐఎస్‌పీఎఫ్) వేదికగా గోర్ వెల్లడించారు. 'యూఎఫ్‌సీ 327 ఈవెంట్ వేదిక వెనుక ఉన్నప్పుడు మోదీకి ఫోన్ చేద్దామని ట్రంప్ నాతో అన్నారు. ఆ సమయంలో భారత్‌లో ఉదయం 6 గంటలని, ఇది తగిన సమయం కాదని సూచించా. అయినా ట్రంప్ తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. మోదీ మేల్కొనే ఉంటారు, ఆయన కూడా నాలాగే తక్కువగా నిద్రపోతారని అన్నారు. ఆ తర్వాత ట్రంప్ వేదికపైకి వెళ్లాల్సి రావడంతో ఆ కాల్‌ను మరుసటి రోజుకు షెడ్యూల్ చేశారు' అని గోర్ తెలిపారు. ఈ ఘటన అమెరికా-భారత్ సంబంధాల్లో ఉన్న సాన్నిహిత్యాన్ని తెలియజేస్తోందని సర్జియో గోర్ చెప్పుకొచ్చారు. స్నేహం ఉన్నప్పుడు ప్రతి విషయాన్ని షెడ్యూల్ చేయాల్సిన అవసరం ఉండదని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు. అలాగే ట్రంప్‌నకు భారత్‌పై ప్రత్యేక అభిమానం ఉందని, మోదీతో ఆయన సంబంధం ఇతర ప్రపంచ నేతలతో పోలిస్తే భిన్నంగా ఉంటుందన్నారు. కొంతమంది నేతలతో తాము ఫార్మల్‌గా మాత్రమే వ్యవహరిస్తామని, కానీ ప్రధాని మోదీ విషయంలో అలా ఉండదని పేర్కొన్నారు. అలాగే భారత్ పర్యటన జ్ఞాపకాలను ట్రంప్ తరచూ గుర్తు చేసుకుంటారని గోర్ తెలిపారు. ఇక అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందం చివరి దశలో ఉందని, కేవలం ఒక శాతం చర్చలు మాత్రమే మిగిలి ఉన్నాయని వెల్లడించారు. కాగా, గోర్ వ్యాఖ్యలు ట్రంప్-మోదీ మధ్య ఉన్న వ్యక్తిగత సాన్నిహిత్యాన్ని మరోసారి చర్చనీయాంశం చేశాయి.



# ఆశారాం బాపుకు దక్కని ఊరట

- బెయిల్ మంజూరుకు సుప్రీం నిరాకరణ

**న్యూఢిల్లీ, జూన్ 30:** 2013లో ఓ బాలికపై అత్యాచారం కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న స్వయంప్రకటిత ఆధ్యాత్మిక గురువు బాబా ఆశారం బాపునకు సుప్రీంకోర్టులో తాత్కాలికంగా ఊరట లభించలేదు. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం బెయిల్ మంజూరు చేయడానికి నిరాకరించింది. తనపై విధించిన జీవిత ఖైదును సమర్థిస్తూ రాజస్థాన్ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఆశారాం బాపు సుప్రీంకోర్టులో సవాలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్ నేతృత్వంలోని ధర్మాసనం రాజస్థాన్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఆశారాం పిటిషన్‌పై రెండు వారాల్లోగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. అయితే, రాష్ట్ర ప్రభుత్వం స్పందించే వరకు ఆశారాంకు ఎలాంటి బెయిల్ మంజూరు చేయ-ంబోమని స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా ఆశారాం తరఫు న్యాయవాదులు వైద్య కారణాలను ప్రస్తావిస్తూ బెయిల్ మంజూరు చేయాలని సుప్రీంకోర్టును అభ్యర్థించారు. అయితే ప్రస్తుతం అలాంటి తక్షణ ఉపశమనానికి అవకాశం లేదని ధర్మాసనం తెలిపింది. ప్రాణాలకు ముప్పు కలిగించేంత తీవ్రమైన అత్యవసర పరిస్థితి ఉన్న సందర్భాల్లో మాత్రమే బెయిల్ అంశాన్ని పరిశీలించగలమని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. రాజస్థాన్ ప్రభుత్వం సమర్పించే కౌంటర్‌ను పరిశీలించిన తర్వాతే బెయిల్‌పై తదుపరి నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం స్పష్టం చేసింది. కాగా, 2013లో రాజస్థాన్‌లో ఓ మైనర్‌పై అత్యాచారం చేసిన కేసులో ఆశారాం బాపు దోషిగా తేలారు. అనంతరం న్యాయస్థానం ఆయనకు జీవిత ఖైదు విధించింది. ప్రస్తుతం ఆశారాం జోధ్‌పూర్ జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. సుప్రీంకోర్టు తాజా నిర్ణయంతో ఆయన న్యాయపరమైన పోరాటం కొనసాగుతున్నప్పటికీ, తక్షణ ఉపశమనం మాత్రం లభించలేదు. ఇప్పుడు రాజస్థాన్ ప్రభుత్వం సమర్పించే అఫిడవిట్, తదుపరి విచారణలో కోర్టు అభిప్రాయం కీలకంగా మారనున్నాయి.

# అరుణాచల్‌లో చైనా చొరబాట్లు

**న్యూఢిల్లీ, జూన్ 30:** చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ అరుణాచల్ ప్రదేశ్‌లో చొరబాట్లకు పాల్పడిందని, అక్కడ సైనిక శిబిరాలను ఏర్పాటు చేసిందని కొన్ని కథనాలు ప్రచారం కావడంతో, వాటిని భారత సైన్యం తోసిపుచ్చింది. ఆ కథనాల్లో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేసింది. అదంతా ఎలాంటి ఆధారం లేకుండా జరుగుతోన్న అసత్య ప్రచారమని వెల్లడించింది. మీడియా కథనాల ప్రకారం.. అరుణాచల్ ప్రదేశ్ లోని తక్సింగ్ ప్రాంతంలోని నాహ్ ట్రైబల్ గ్రూప్‌నకు చెందిన నాహ్ వెల్ఫేర్ సొసైటీ .. ప్రభుత్వ అధికారులకు గతంలో ఒక వినతి ప్రతాన్ని సమర్పించింది. భారత్-చైనా సరిహద్దు సమీపంలో పీఎల్‌ఏ శిబిరాలను ఏర్పాటు చేసిందని అందులో ఆరోపించింది. గత 10- 15 సంవత్సరాలుగా చైనా సైనికులు తక్సింగ్ సరిహద్దు వెంట చొరబాట్లను క్రమంగా విస్తరిస్తున్నారని పేర్కొంది. ఈ వినతి పత్రాన్నే మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలోనే ఆర్మీ స్పందన వచ్చింది.

# భారత ఆర్మీ చీఫ్‌గా ధీరజ్ సేథ్

**పదవీ బాధ్యతలు స్వీకరించిన జనరల్ ధీరజ్**

**న్యూఢిల్లీ, జూన్ 30:** భారత సైన్యానికి నూతన అధిపతిగా జనరల్ ధీరజ్ సేథ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. దేశ 31వ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. జనరల్ ఉపేంద్ర ద్వివేది స్థానంలో.. కొత్త ఆర్మీ చీఫ్ కమాండ్ చేపట్టారు. ఆర్మోర్డ్ కార్ప్స్ విభాగం నుంచి ఆర్మీ చీఫ్ పదవిని అధిష్ఠించిన 7వ అధికారిగా ధీరజ్ సేథ్ రికార్డు సృష్టించారు. సౌత్ బ్లాక్ లాన్స్‌లో సైనిక సంప్రదాయాల మధ్య అధికారికంగా కొత్త ఆర్మీ చీఫ్ బాధ్యతలు స్వీకరించారు. 1986లో ఆర్మోర్డ్ కార్ప్స్‌లో కమిషన్డ్ అధికారిగా జనరల్ ధీరజ్ సేథ్ ప్రస్థానం ప్రారంభించారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద నిరోధక దళానికి కమాండర్‌గా పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఆయనకు ఉంది. సైన్యంలో కీలకమైన సదరన్ కమాండ్, సౌత్ వెస్ట్రన్ కమాండ్.. రెండింటికీ ఆర్మీ కమాండర్‌గా ధీరజ్ సేథ్ వ్యవహరించారు. రక్షణ విభాగంలో ప్లానింగ్, కేపబిలిటీ డెవలప్‌మెంట్‌లో విశేష అనుభవం.. సైన్యం ఆధునికీకరణపై ప్రత్యేక దృష్టి సారించారు.





# కాలనీ సభ్యుల సంఘటితంతోనే అభివృద్ధి సాధ్యం

**మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి**

- శ్రీ సాయి నగర్ కాలనీ నూతన కమిటీ ఏకగ్రీవం
- అధ్యక్షులుగా ప్రభాకర్ చారి, ప్రధాన కార్యదర్శిగా నాగిరెడ్డి ఏకగ్రీవం
- శాలువాలతో సన్మానించిన మాజీ కార్పొరేటర్





**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** కాలనీ సభ్యుల సహకారం సంఘటితంతోనే కాలనీ అభివృద్ధి సాధ్యపడుతుందని 25వ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొంతిరి హరి శంకర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని మేడిపల్లి డివిజన్ శ్రీ సాయి నగర్ కాలనీ నూతన అసోసియేషన్ సభ్యులను 25వ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి ఘనంగా సన్మానించారు. బోడుప్పల్ సర్కిల్ తొమ్మిదో డివిజన్ పరిధిలోకి వచ్చే ఈ కాలనీ సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని కాలనీ వాసులు ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పాల్గొని నూతనంగా ఎన్నికైన ప్రతినిధు లను శాలువాలతో సత్కరించి అభినంద నలు తెలిపారు. కాలనీ అభివృద్ధికి నూతన కమిటీ సభ్యులు నిరంతరం కృషి చేయాలని, స్థానిక సమస్యల పరిష్కా రంలో చురుకైన పాత్ర పోషించాలని ఆయన ఆకాంక్షించారు. అందరూ సమిష్టిగా పనిచేస్తూ కాలనీని ఆదర్శవం తంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ ఎన్నికతో కాలనీలో మరిన్ని అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయని కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. నూతన కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నం దుకు కాలనీ వాసులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కాలనీలో మౌలిక వసతుల కల్పనకు, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ శ్రమి స్తామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ప్రభాకర్ చారి, ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, కోశాధికారి నిరంజన్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఇబ్రహీం, ఉపాధ్యక్షులు సరస్వతి, భాస్కర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు చిరంజీవి, భానుప్రకాష్, ప్రదీప్, మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, సలహాదారులు కళావతి, రాజేశ్వరి, లలిత, భారతి, గౌరవ అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి, సునీల్, హరిందర్ యాదవ్, యాదగిరి, తదిత రులు పాల్గొన్నారు.

# త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

**మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి**

- ఎంపీ ల్యాండ్స్ నిధులతో భగత్ సింగ్ కాలనీలో బోర్ వెల్ పనులను ప్రారంభించిన మాజీ మేయర్
- ఎంపీ ఈటెల రాజేందర్ కు కృతజ్ఞతలు తెలిపిన భగత్ సింగ్ కాలనీవాసులు



**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీర్జాదిగూడ డివిజన్ భగత్ సింగ్ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఎంపీ లాడ్స్ నిధులతో చేపట్టిన బోర్‌వెల్ నిర్మాణ పనులను మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ప్రారంభించారు. కాలనీలో చాలా కాలంగా ఉన్న నీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని ఈ బోర్‌వెల్ నిర్మాణానికి నిధులు కేటాయించిన మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్‌కు కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో ఎంపీ సహకారం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రభుత్వ ప్రజాప్రతినిధుల సహకారంతో ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. సీపీఐ పార్టీ కార్యవర్గ సభ్యురాలు లక్ష్మి మాట్లాడుతూ, భగత్ సింగ్ కాలనీ ప్రజలు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న తాగునీటి సమస్యకు ఈ బోర్‌వెల్ నిర్మాణం శాశ్వత పరిష్కారానికి దోహదపడుతుందని, ప్రజల అవసరాలపై స్పందించి నిధులు కేటాయించిన ఎంపీ ఈటెల రాజేందర్‌కు, పనులు ప్రారంభించిన మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డికి కాలనీ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు నిర్మల, సీపీఐ భగత్ సింగ్ కాలనీ కన్వీనర్ మహేశ్వరి, సీపీఐ మహిళా అధ్యక్షురాలు జ్యోతి, సిపిఐ నాయకులు బొందయ్య, చంద్రయ్య, నరేష్, మహిపాల్, బీఆర్ఎస్ నాయకులు నరసింహ చారి, యాదగిరి, రామకృష్ణ, పవన్, మార్టిన్ తదితరులు పాల్గొన్నారు.

## పదవి విరమణ పొందిన పోలీసు అధికారుల సన్మానించిన ఎస్పీ స్నేహ మెహ్రా



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం పాటు విశిష్ట సేవలు అందించి మంగళవారం పదవీ విరమణ పొందిన ముగ్గురు పోలీస్ అధికారులకు వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా స్పెషల్ బ్రాంచ్ (డిఎస్ బి)కు చెందిన ఎస్ఐ బి. గైబప్ప, జిల్లా రిజర్వ్ ఆర్మ్డ రిజర్వ్ (డి ఏ ఆర్)కు చెందిన ఏఆర్ఎస్ఐ ఎం.ఏ. సలీం, ఏఆర్ఎస్ఐ జి. బిచ్చప్ప లు ప్రభుత్వ సేవ నుండి పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగం ఎంతో బాధ్యతతో కూడుకున్నదని అన్నారు. ప్రభుత్వ సేవ అనేది ఉద్యోగం మాత్రమే కాదు ప్రజల పట్ల బాధ్యతతో కూడిన పవిత్రమైన సేవ. పదవీ విరమణ పొందుతున్న అధికారులు తమ సుదీర్ఘ సేవా కాలంలో క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావంతో పోలీస్ శాఖ ప్రతిష్ఠను మరింత పెంచారు. తమ సుదీర్ఘ సేవా కాలంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల భద్రతకు అందించిన సేవలు మరవలేనివని, ప్రజలకు సేవ చేయడంలో వారు చూపిన నిబద్ధత యువ పోలీసు సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తుంది. ఇట్టి అధికారులు పదవీ విరమణ అనంతరం ఆరోగ్యంగా, ఆనందంగా కుటుంబ సభ్యులతో కలిసి సుఖసంతోషాలతో జీవించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను అని పేర్కొన్నారు. పదవీ విరమణ పొందిన ఏఆర్ఎస్ఐ ఎం.ఏ. సలీం 03.01.1989న పోలీస్ శాఖలో చేరి 37 సంవత్సరాల 6 నెలల సేవ అనంతరం పదవీ విరమణ పొందగా, ఏఆర్ఎస్ఐ జి. బిచ్చప్ప గారు 1986లో శాఖలో చేరి 40 సంవత్సరాల 5 నెలల సేవను పూర్తి చేసి పదవీ విరమణ పొందారు. ఎస్ఐ బి. గైబప్ప 06.03.1985న శాఖలో చేరి 41 సంవత్సరాల 4 నెలల పాటు విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పదవీ విరమణ పొందిన అధికారులను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేసి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిటిసి డిఎస్పి శ్రీనివాస్, డిఎస్‌బి ఇన్‌స్పెక్టర్ నాగార్జున, ఆర్ఐ నాగరాజు, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్, డీపీఓ సిబ్బంది, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న కార్మికులకు 26000 ఇవ్వాలి

**సిఐటియు వికారాబాద్ జిల్లా నాయకులు ఆర్ మహిపాల్**



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ కార్మికులకు 26000 కనీస వేతనం ఇవ్వాలని సిఐటియు వికారాబాద్ జిల్లా నాయకులు ఆర్ మైపాల్ అన్నారు. ఈఎస్ఐ పీఎఫ్ ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు అమలు చేయాలని ప్రభుత్వనికి డిమాండ్ చేస్తున్నామన్నారు. అందరికీ ఇండ్లు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని కలెక్టర్ కార్యాలయం నిరసన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంటాక్ట్ అవుట్సోర్సింగ్ యూనియన్ సిఐటియు జిల్లా నాయకులు ఆర్ మహిపాల్, సురేందర్, నర్సింలు, కాశయ్య, కృష్ణయ్య, లలిత, యాదయ్య, బందయ్య, నరసింహులు, అమరావతి, మహేష్, రామచంద్రయ్య, రాజు, అశోక్, కృష్ణ, సుధాకర్, మోహన్, కుమార్, ప్రవీణ్ కుమార్, శ్రీను, రవి, రాజు, సంగమేశ్వర్, జయ, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు



**మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి**

- రాయంచ కాలనీ శ్రీ పంచముఖ హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన మాజీ ప్రజాప్రతినిధులు
- ఆలయ అభివృద్ధికి రూ. 25,000/- విరాళమందించిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆకుల మధుకర్
- శాలువాలతో సన్మానించిన కమిటీ సభ్యులు

**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీర్జాదిగూడ డివిజన్ రాయంచకాలనీలో ఉన్న శ్రీ పంచముఖ హనుమాన్ దేవాలయంలో మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొల్తూరి మహేష్, నాయకులు ఆకుల మధుకర్, కిరణ్ నాయక్ తదితరులు కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా నాయకులు ఆకుల మధుకర్ దేవాలయ అభివృద్ధి కోసం తనవంతు సహకారంగా రూ.25,000 నగదు విరాళాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న దాతలను కమిటీ సభ్యులు అభినందించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొల్తూరి మహేష్, నాయకులు ఆకుల మధుకర్ లను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, కృష్ణ, వెంకటేష్, సత్తయ్య, బల్లెపు చంద్రశేఖర్, శ్రీనివాస్, సుమన్, అశోక్‌తో పాటు కాలనీవాసులు, భక్తులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.



# శేరిలింగంపల్లి కాంగ్రెస్ లేబర్ సెల్‌కు నూతన నియామకాలు

- పార్టీ బలోపేతమే ధ్యేయం - నాయకులు
- మాదాపూర్, చందానగర్ డివిజన్లకు నూతన అధ్యక్షురాళ్లు, సెక్రటరీల నియామక పత్రాల అందజేత



**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్ :** టీపీసీసీ ఇంచార్జీ సంగిశెట్టి జగదీశ్వర్ రావు, చైర్మన్ రాంబాగ్ ప్రకాశ్ గౌడ్ ఆదేశాల మేరకు శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ లేబర్ సెల్‌లో నూతన నియామకాలు చేపట్టారు.మంగళవారం టీపీసీసీ రాష్ట్ర లేబర్ సెల్ వైస్ చైర్మన్ నల్ల సంజీవరెడ్డి నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో నూతన నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి శేరిలింగంపల్లి నియోజకవర్గ అధ్యక్షులు మాదిరెడ్డి మోహన్ రెడ్డి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వీరమల్ల వీరేందర్ గౌడ్ నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా మాదాపూర్ డివిజన్ లేబర్ సెల్ అధ్యక్షురాలుగా ఎన్. శ్రీజారెడ్డి, ఉపాధ్యక్షురాలుగా శశిరేఖ, చందానగర్ డివిజన్ ఉపాధ్యక్షురాలుగా నాజియా బేగం, మాదాపూర్ డివిజన్ సెక్రటరీలుగా మోహన్, చైతన్యలకు నియామక పత్రాలు అందజేశారు. నియామక పత్రాలు అందుకున్న నాయకులు, నాయకురాళ్లు మాట్లాడుతూ, తమపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన సీనియర్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం, పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ లేబర్ సెల్ ప్రధాన కార్యదర్శి ముద్దంగుల తిరుపతి, చందానగర్ డివిజన్ అధ్యక్షురాలు పి. శాంత, ఆల్విన్ కాలనీ డివిజన్ అధ్యక్షులు జి. రవి, మియాపూర్ డివిజన్ అధ్యక్షులు దయాకర్ రెడ్డి, వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షులు జూపల్లి శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని గడ్డు కార్యకర్తలతో బలోపేతం చేసి, రాబోయే ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యమని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.



# రైతు భరోసా పథకాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి

## కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**రామారెడ్డి రాజముద్ర న్యూస్:** జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ రామారెడ్డి మండలం లోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి కార్యక్రమం లో పాల్గొని మాట్లాడుతూ, రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడం, రైతులకు పెట్టుబడి వ్యయభారం తగ్గించడం, సాగుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని సకాలంలో అందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా రైతు భరోసా పథకాన్ని ప్రారంభించడం రైతాంగానికి శుభపరిణామమని అన్నారు. ఈ పథకం ద్వారా అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా ఆర్థిక సాయం జమ చేయడం వల్ల పారదర్శకతతో పాటు సకాలంలో పెట్టుబడి అందే అవకాశం కలుగుతుందని తెలిపారు. జిల్లాలో 2025–26 వానాకాలం సీజన్‌లో 10,851 మంది రైతులకు రూ.9,35,33,533 రైతు భరోసా నిధులు జమయ్యాయని, అలాగే 2025–26 యాసంగి సీజన్‌లో 10,950 మంది రైతులకు రూ.7,34,81,576 ఆర్థిక సహాయం అందించామని వెల్లడించారు. రెండు ఎకరాలు ఉన్న వారికి రైతుల ఖాతాలో ఇప్పుడు జమ అవుతాయని, మిగితా 9 రోజుల్లో జమ అవుతాయని అన్నారు. అర్హులైన ప్రతి రైతుకు ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు రైతు భరోసా సాయం అందేలా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దరఖాస్తులు, అర్హతల పరిశీలన, నిధుల జమ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని వ్యవసాయ ఉత్పాదకతను పెంచడంతో పాటు ఆధునిక సాగు పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ NV గిరి, డిప్యూటీ ట్రయిని కలెక్టర్ రవితేజ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడుప్రవీణ్ గౌడ్, రామారెడ్డి సర్పంచ్ ప్రవీణ్, ఉప సర్పంచ్ నవీన్, ఎంఈఓ ఆనంద్ రావు, ఏడిఏ సుధా మాధూరి, డి ఈ ఓ మోహన్, తహసీల్దార్ సుమలత, మండల వ్యవసాయ అధికారి భాను శ్రీ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



# మంత్రి పొంగులేటిపై వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి: కాంగ్రెస్ నేతలు



- తాతా మధుకు పాలేరులో ఎన్ని పంచాయతీలు ఉంటాయో కూడా తెలియదు
- నేలకొండపల్లిలో కాంగ్రెస్ ఫైర్

**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి:రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై బీఆర్ఎస్ నేత తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని నేలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు.పాలేరు నియోజకవర్గంలో మంత్రి పొంగులేటి నాయకత్వంలో ఎంతో అభివృద్ధి జరిగిందని, 6000 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని వారు తెలిపారు. "తాతా మధుకు పాలేరులో ఎన్ని గ్రామ పంచాయతీలు ఉంటాయో కూడా తెలియదు. సొంత మండలం తిరుమలాయపాలెంలో ఆసుపత్రి కట్టించాడు తప్ప ఇక్కడ ఏమీ చేయలేదు" అని విమర్శించారు."మొన్న జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ రెండు సీట్లు కూడా గెలవలేదు. ఉపేందర్ రెడ్డి 60 వేల మెజారిటీతో ఓడిపోయాడు. దమ్ముంటే ఎంపీటీసీ, జడ్పీటీసీ గెలిచి చూపాలి" అని సవాల్ విసిరారు.108మందిఎంపీటీసీలతో క్యాంపు పెట్టి ఎమ్మెల్సీని గెలిపించిన ఘనత పొంగులేటిదేనని, ఆయనకు పోటీ కేసీఆర్‌తోనే తప్ప బచ్చా నాయకులతో కాదని వారు స్పష్టం చేశారు. అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని బీఆర్ఎస్ నేతలకు సవాల్ విసిరారు.ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొడాలి గోవిందరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, నెల్లూరి భద్రయ్య, బొడ్డు బొందయ్య తదితరులు పాల్గొన్నారు.



# సిపిఐ(ఎం) శిక్షణ తరగతులు విజయవంతం

## నిర్మాణ ఐక్యతతోనే పార్టీ బలం: డివిజన్ కార్యదర్శి బండి రమేష్..

**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి లోని శ్రీకర గార్డెన్స్‌లో పోతనబోయిన పెరుమాళ్ళ ప్రాంగణంలో మూడు రోజుల పాటు జరిగిన సిపిఐ(ఎం) పాలేరు డివిజన్ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు విజయవంతంగా ముగిశాయి. మూడవ రోజు 'పార్టీ నిర్మాణం' అంశంపై డివిజన్ కార్యదర్శి బండి రమేష్ మాట్లాడుతూ, "ప్రపంచీకరణ నేపథ్యంలో కమ్యూనిస్టులను చెడగొట్టే ప్రమాదాలున్నాయి. అన్నింటినీ ఎదుర్కొని ప్రజా సమస్యలపై పోరాడటమే కమ్యూనిస్టుల లక్షణం. నిర్మాణ ఐక్యతతో పాలేరు డివిజన్‌లో పార్టీని అగ్రభాగాన నిలపాలి" అని పిలుపునిచ్చారు.'పార్టీ కర్తవ్యాలు' అంశంపై జిల్లా కమిటీ సభ్యుడు షేక్ బషీరుద్దీన్ మాట్లాడుతూ, "విద్యా సంవత్సరం ప్రారంభమైనందున పాఠశాలల్లో సర్వే చేసి విద్యార్థుల సమస్యలపై ఆందోళన చేయాలి. వర్షాకాలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లలో సర్వే చేపట్టాలి. రైతు సమస్యలు, సంక్షేమ పథకాల అమలు కోసం ఉద్యమాలు ఉధృతం చేయాలి" అని సూచించారు.ఆహ్వాన సంఘం అధ్యక్షుడు ఏటుకూరి రామారావు మాట్లాడుతూ, శిక్షణలో నేర్చుకున్న అంశాలతో గ్రామీణ ప్రజలను చైతన్యవంతం చేసి డివిజన్‌లో ఉద్యమాలు ముందుకు తీసుకెళ్లాలని కోరారు.జిల్లా నాయకుడు గొడవర్తి నాగేశ్వరరావు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిన ఈ తరగతుల్లో ఎర్ర శ్రీనివాసరావు, బొంతు రాంబాబు, నంద్ర ప్రసాద్, కొమ్ము శ్రీను, మండల కార్యదర్శులు కె.వి.రెడ్డి, తోటకూరి రాజు, వడ్లమూడి నాగేశ్వర రావు, ప్రజానాట్యమండలి ప్రతినిధులు గాదె వెంకటేశ్వరరావు, కాల్వ కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వైఫల్యాలను కప్పిపుచ్చేందుకే బిఆర్ఎస్‌పై వ్యక్తిగత విమర్శలు: పాలేరు బిఆర్ఎస్ శ్రేణుల ధ్వజం

**420 హామీలు అమలు చేయాలి లేదంటే రాజీనామా చేసి ప్రజాక్షేత్రంలో తేల్చుకోవాలి: కాంగ్రెస్‌కు సవాల్**





**ఖమ్మం రాజముద్ర న్యూస్:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తమ వైఫల్యాలను, అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికే బిఆర్ఎస్ పార్టీ అధిష్టానం జిల్లా నేతలపై చౌకబారు వ్యక్తిగత విమర్శలకు దిగుతోందని పాలేరు నియోజకవర్గ బిఆర్ఎస్ ముఖ్య నేతలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం ఖమ్మంలోని తెలంగాణ భవన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో పాలేరు నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల మాజీ పార్టీ అధ్యక్షులు, ముఖ్య నేతలు సంయుక్తంగా విలేకరుల సమావేశం నిర్వహించారు.

**లారీల వద్ద దళారీ వసూళ్లు కాంగ్రెస్ చరిత్రే: బెల్లం వేణుగోపాల్**

బిఆర్ఎస్ ఖమ్మం రూరల్ మాజీ మండల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్ మాట్లాడుతూ, "మొక్కజొన్న, వరి కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా బయటపడింది. బిఆర్ఎస్ హయాంలో అన్‌కండిషనల్‌గా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. కానీ నేడు కనీసం సెంటర్స్ పెట్టడం, బస్తాలు ఇవ్వడం చేతకాని కాంగ్రెస్ నేతలు విమర్శలు చేయడం సిగ్గుచేటు. గత 30 ఏళ్లుగా లారీ డ్రైవర్ల వద్ద బస్తాకు 15 నుండి 20 రూపాయలు వసూలు చేయించిన దళారీ చరిత్ర కాంగ్రెస్‌ది. పాలేరు రైతాంగాన్ని అడిగితే ప్రతి బస్తాకు 60 రూపాయల చొప్పున, ఒక్కో లోడుకు రూ. 50,000 రైతుల నుండి అక్రమంగా వసూలు చేసిన పాపం మీకే దక్కుతుంది" అని ఆరోపించారు."తాతా మధు ఉన్నత చదువులకై అమెరికా వెళ్లి, కేసీఆర్ విధానాలు నచ్చి పార్టీలో చేరి దశాబ్ద కాలంగా నిలకడగా కష్టపడి ఈ స్థాయికి వచ్చారు. పొంగులేటి రాఘవరెడ్డి ఆస్తులపై, కాంగ్రెస్ నేతల భూకబ్జాలపై పిండిప్రోలు గ్రామ ప్రజలే సాక్ష్యం" అని పేర్కొన్నారు.

**ఎమ్మెల్యే పదవికి రాజీనామా సవాల్**

"పాలేరులో కరువును పారదోలి, మున్నేరుపై చెక్ డ్యామ్‌లు కట్టించి, తిరుమలాయపాలెం నుండి మొలకలపల్లి కోట వరకు బ్రిడ్జిలు నిర్మించిన ఘన చరిత్ర కందాల ఉపేందర్ రెడ్డి ది. మంత్రి కి, కాంగ్రెస్ నేతలకు దమ్ముంటే ఇప్పుడే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ప్రజాక్షేత్రంలోకి రావాలి. 2027-28 వరకు ఆగాల్సిన అవసరం లేదు. ఇప్పుడే ఉపేందర్ రెడ్డి పై పోటీ చేసి గెలవాలని సవాల్ విసురుతున్నాం. ఒకవేళ కాంగ్రెస్ గెలిస్తే మేము మా పదవులకు కుట్టు వేసుకుని తిరుగుతాం" అని వేణుగోపాల్ హెచ్చరించారు.

**మహిళలను కించపరిస్తే సహించేది లేదు: భాషబోయిన వీరన్న**

బిఆర్ఎస్ తిరుమలాయపాలెం మాజీ మండల పార్టీ అధ్యక్షులు భాషబోయిన వీరన్న మాట్లాడుతూ, "ముఖ్యమంత్రి సభకు సంబంధించి ఎమ్మెల్సీ తాతా మధు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక వ్యక్తిగత దూషణలకు దిగడం రాజకీయ అపరిపక్వతకు నిదర్శనం. వందల కొద్దీ దౌర్జన్యాలు, ల్యాండ్ సెటిల్‌మెంట్లు, మైనింగ్ అక్రమ కేసులు ఉన్న కాంగ్రెస్ నేతలు తాతా మధు పై మాట్లాడటం హాస్యాస్పదం. బిఆర్ఎస్ మహిళా నేతలను, తిరుమలాయపాలెం ఆడబిడ్డలను కించపరిచేలా మాట్లాడితే భవిష్యత్తులో మహిళా లోకమే బుద్ధి చెబుతుంది" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**పొంగులేటి లూటీలను సొంత పార్టీ నేతలే ఎండగట్టారు: ఉన్నం బ్రహ్మయ్య**

బిఆర్ఎస్ నేలకొండపల్లి మాజీ మండల పార్టీ అధ్యక్షులు ఉన్నం బ్రహ్మయ్య మాట్లాడుతూ, "తాతా మధు చేసిన ఆరోపణలు కొత్తవి కావు. నాడు కాంగ్రెస్‌లోనే ఉన్న రేవంత్ రెడ్డి , జగ్గయ్యపేట ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, కొండా సురేఖ పొంగులేటి భూకబ్జాలు, రాఘవ కన్స్ట్రక్షన్స్ అక్రమాలు, సమ్మక్క సారలక్క కాంట్రాక్టుల కమిషన్ల లూటీలను ఎండగట్టారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలను అమలు చేయలేక, ప్రజా వ్యతిరేకతను తట్టుకోలేకనే ఇటువంటి ప్రేలాపనలకు దిగుతున్నారు" అని విమర్శించారు.

**రెండున్నరేళ్లుగా పాలేరుకు కాంగ్రెస్ చేసింది శూన్యం: వేముల వీరయ్య**


కూసుమంచి మాజీ మండల పార్టీ అధ్యక్షులు వేముల వీరయ్య మాట్లాడుతూ, "కందాల ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పాలేరులో ఎంతో అభివృద్ధి జరిగింది. కానీ, నేడు అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా కాంగ్రెస్ సాధించింది శూన్యం. గతంలో కేసీఆర్ అన్‌కండిషనల్‌గా ప్రతి ఎకరాకు రైతుబంధు ఇస్తే, నేడు కాంగ్రెస్ కండిషన్ల పేరుతో దాన్ని ఎగ్గొట్టేందుకు కుట్ర చేస్తోంది. ఇప్పటికే మూడు విడతల రైతు భరోసాను ఎగ్గొట్టిన ఘనత ఈ ప్రభుత్వానిది" అని దుయ్యబట్టారు.

**వ్యక్తిగత విమర్శలు మానుకోకుంటే తీవ్ర పరిణామాలు: కొప్పుల ఉపేందర్ రెడ్డి**

బిఆర్ఎస్ తిరుమలాయపాలెం మండల నాయకులు కొప్పుల ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ, "అధికార పక్షం తమ మండల పార్టీ నాయకులతో వాట్సప్‌లలో, సోషల్ మీడియాలో వ్యక్తిగత దూషణలు చేయించడం మంచి పద్ధతి కాదు. యూట్యూబ్‌లో 'పొంగులేటి' అని కొడితే మీ లూటీల చరిత్ర అంతా వస్తుంది. నేడు క్షేత్రస్థాయిలో ప్రజలు, ఆడబిడ్డలు కాంగ్రెస్ పాలనపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. వృద్ధులకు ఆసరా పెన్షన్లు లేవు, ఆడబిడ్డలకు స్కూటీలు లేవు. కాంగ్రెస్ నేతలు తమ వైఖరి మార్చుకోకపోతే రాబోయే రోజుల్లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది" అని హెచ్చరించారు.ఈ సమావేశంలో పాలేరు నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, ఉన్నం బ్రహ్మయ్య, భాషబోయిన వీరన్న, వేముల వీరయ్య, మాజీ జడ్పీటీసీ వర ప్రసాద్, నాయకులు మరికంటి రేణుబాబు, చావా వేణుగోపాల్, మల్లీదు వెంకన్న, కొప్పుల ఉపేందర్ రెడ్డి, మంచా నాయక్, ఉదయ్ శంకర్ రాజు, గుండెబోయిన దర్గయ్య, మహబూబ్ అలీ, వెంపటి క్రిష్ణా రావు, మట్టా వేంకటేశ్వరరావు, మొర్రిమేకల నాగేశ్వర రావు, జర్పుల లక్ష్మణ్, నారపాటి రమేష్, దోమల రవి, రెడ్య నాయక్, బానోత్ వీరన్న, కోటా సైదా రెడ్డి, మేదరమెట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఇన్నోసెంట్ కైయా' సెంచరీ

- బంగ్లాదేశ్‌పై ఇన్నింగ్స్ తేడాతో జింబాబ్వే ఘన విజయం.!
- ఇన్నింగ్స్ 85 పరుగుల తేడాతో బంగ్లాదేశ్ చిత్తు



**హరారే, జూన్ 30:** హరారే వేదికగా జరిగిన ఏకైక టెస్టు మ్యాచ్‌లో జింబాబ్వే జట్టు అన్ని విభాగాల్లో అద్భుత ప్రదర్శనతో బంగ్లాదేశ్‌ను ఇన్నింగ్స్ 85 పరుగుల తేడాతో చిత్తుగా ఓడించింది. ఓపెనర్ ఇన్నోసెంట్ కైయా కెరీర్‌లో తొలి టెస్టు సెంచరీతో చెలరేగగా, బౌలర్లు సమిష్టిగా రాణించి జింబాబ్వేకు చిరస్మరణీయ విజయాన్ని అందించారు. తొలి ఇన్నింగ్స్‌లో ఇన్నోసెంట్ కైయా 227 బంతుల్లో 17 ఫోర్లతో 140 పరుగులు చేసి జింబాబ్వే భారీ స్కోరుకు పునాది వేశాడు. బ్రియాన్ బెన్నెట్ (59), కెప్టెన్ క్రెయిగ్ ఎర్విన్ (60), వెస్లీ మధేవెరే అజేయంగా 77 పరుగులు చేయడంతో జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 410 పరుగులు చేసింది. భారీ లక్ష్యాన్ని ఎదుర్కొన్న బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో మొమినుల్ హక్ (60) మినహా మిగతా బ్యాటర్లు విఫలమవడంతో కేవలం 140 పరుగులకే ఆలౌటైంది. దీంతో ఫాలోఆన్ ఆడిన బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్‌లోనూ నిలదొక్కుకోలేక 185 పరుగులకే కుప్పకూలింది. ముష్ఫికర్ రహీమ్ (34), కెప్టెన్ నజ్ముల్ హొస్సేన్ శాంటో (30) కొంత ప్రతిఘటించినా ఫలితం లేకపోయింది. జింబాబ్వే బౌలర్లలో బ్లెస్సింగ్ ముజరబాని రెండో ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లు పడగొట్టగా, రిచర్డ్ నగరవా మూడు వికెట్లు తీసి విజయాన్ని ఖాయం చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లోనూ నగరవా, ముజరబాని, న్యూమన్ న్యాంహూరి అద్భుత బౌలింగ్‌తో బంగ్లాదేశ్‌ను కట్టడి చేశారు. ఇదిలా ఉండగా, ఇన్నోసెంట్ కైయా ఇటీవల అసాధారణ ఫామ్‌లో కొనసాగుతున్నాడు. గత 11 ఇన్నింగ్స్‌ల్లో ఏడు సెంచరీలు బాదిన ఈ 33 ఏళ్ల బ్యాటర్, 2026 ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకు 110కు పైగా సగటుతో 995 పరుగులు సాధించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఆలస్యంగా అరంగేట్రం చేసిన కైయా ఇప్పటివరకు మూడు టెస్టుల్లో ఒక సెంచరీ, ఒక అర్ధసెంచరీ నమోదు చేయగా, వన్డేల్లో 450, టీ20ల్లో 290 పరుగులు చేశాడు. ప్రస్తుతం జింబాబ్వే క్రికెట్‌లో అత్యుత్తమ బ్యాటర్లలో ఒకరిగా నిలుస్తున్నాడు.



# ఫ్రెంచ్ ఓపెన్ ఛాంపియన్ ఆంద్రీవాకు వింబుల్డన్‌లో ఘన ఆరంభం

**లండన్, జూన్ 30 :** ఫ్రెంచ్ ఓపెన్ ఛాంపియన్ మీర్రా ఆంద్రీవా వింబుల్డన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో తన జోరును కొనసాగిస్తూ శుభారంభం చేసింది. తొలి రౌండ్‌లో పోలండ్‌కు చెందిన మాగ్డా లినెట్‌పై 7-5, 6-4 సెట్ల తేడాతో అద్భుత విజయాన్ని నమోదు చేసి రెండో రౌండ్‌కు అర్హత సాధించింది. ఐదో సీడ్‌గా బరిలోకి దిగిన 19 ఏళ్ల ఆంద్రీవా ఈ మ్యాచ్‌లో ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. కీలక పాయింట్లలో స్థిరమైన ప్రదర్శన కనబరుస్తూ ప్రత్యర్థిపై ఆధిపత్యం చూపించింది. మొదటి సెట్‌లో తీవ్ర పోరాటం జరిగినప్పటికీ, కీలక గేమ్‌లను తనవైపు తిప్పుకుని సెట్‌ను కైవసం చేసుకుంది. రెండో సెట్‌లో కూడా అదే జోరు కొనసాగిస్తూ మ్యాచ్‌ను 7-5, 6-4తో ముగించింది. ఈ విజయంతో ఆమె రెండో రౌండ్‌లోకి అడుగుపెట్టగా, అక్కడ ఆమెకు మరింత కఠిన పరీక్ష ఎదురుకానుంది. డిఫెండింగ్ వింబుల్డన్ ఛాంపియన్ బార్బోరా క్రెజికోవాతో ఆమె తలపడనుంది. ఈ మ్యాచ్‌పై ఇప్పటినుంచే టెన్నిస్ అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. గతేడాది వింబుల్డన్‌లో ఆంద్రీవా క్వార్టర్ ఫైనల్ వరకు అద్భుతంగా రాణించి, ఆఖరి దశలో ఓటమి పాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఆ అనుభవంతో ఈసారి మరింత పటిష్టంగా బరిలోకి దిగిన ఆమె, టైటిల్ గెలవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఇటీవల ఫ్రెంచ్ ఓపెన్‌లో తన కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను సాధించిన ఆంద్రీవా, అతి పిన్న వయసులో ఈ ఘనత సాధించిన రెండో మహిళా టెన్నిస్ క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. వింబుల్డన్ మాజీ ఛాంపియన్ కొన్చితా మార్టినెజ్ శిక్షణలో రాణిస్తున్న ఆమె, ప్రస్తుతం ప్రపంచ టెన్నిస్‌లో అత్యంత వేగంగా ఎదుగుతున్న యువ సంచలనంగా నిలుస్తోంది.

# మహిళల టీ20 సెమీఫైనల్‌లో ఆస్ట్రేలియా-వెస్టిండీస్ పోరు

**లండన్, జూన్ 30 :** మహిళల టీ20 ప్రపంచకప్ 2026 సెమీఫైనల్‌లో ఆస్ట్రేలియా, వెస్టిండీస్ జట్లు తలపడబోతున్నాయి. లండన్‌లోని ది ఓవల్ మైదానంలో ఈ కీలక మ్యాచ్ జరగనుంది. రాత్రి 7:00 గంటలకు ప్రారంభమయ్యే ఈ పోరు ఫైనల్‌కు చేరే జట్టును నిర్ణయించనుండటంతో క్రికెట్ ప్రపంచం మొత్తం ఈ మ్యాచ్‌పై దృష్టి పెట్టింది. డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియా ఈ టోర్నీలో అద్భుత ఫామ్‌లో ఉంది. లీగ్ దశలో ఒక్క ఓటమి కూడా లేకుండా సెమీఫైనల్‌కు చేరి తన ఆధిపత్యాన్ని చూపించింది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమతూకంగా బలంగా ఉన్న ఈ జట్టు టైటిల్ గెలిచే ప్రధాన ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. ఇక హేలీ మాథ్యూస్ నాయకత్వంలోని వెస్టిండీస్ జట్టు కూడా పోరాట పటిమతో సెమీఫైనల్‌కు చేరింది. కొన్ని మ్యాచ్‌ల్లో ఇబ్బందులు ఎదురైనా కీలక సమయాల్లో రాణించి ముందుకు సాగింది. 2016లో ఆస్ట్రేలియాపై ఫైనల్ విజయం సాధించిన అనుభవంతో ఈసారి కూడా సంచలనం సృష్టించాలని ఆ జట్టు లక్ష్యంగా పెట్టుకుంది.




# ఆసియా క్రీడల కోసం భారత మహిళల క్రికెట్ జట్టు ప్రకటన

**న్యూఢిల్లీ, జూన్ 30 :** రాబోయే 2026 ఆసియా క్రీడల కోసం బీసీసీఐ 15 మంది సభ్యులతో కూడిన భారత మహిళల క్రికెట్ జట్టును ప్రకటించింది. జపాన్‌లోని ఐచి--నగోయా వేదికగా సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జరగనున్న ఈ ప్రతిష్టాత్మక క్రీడల్లో భారత్ డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగనుంది. జట్టుకు కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్ కొనసాగుతుండగా, వైస్ కెప్టెన్‌గా స్మృతి మంధాన బాధ్యతలు చేపట్టనున్నారు. ఇటీవల జరిగిన టీ20 ప్రపంచకప్ జట్టులో ఒకే ఒక్క మార్పు చేస్తూ, వికెట్ కీపర్ యస్తికా భాటియా స్థానంలో యువ వికెట్ కీపర్ జి. కమలినికి అవకాశం కల్పించారు. మిగతా జట్టు యథాతథంగా కొనసాగడం జట్టు కూర్పులో స్థిరత్వాన్ని సూచిస్తోంది. బ్యాటింగ్ విభాగంలో హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధాన, షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్ కీలక పాత్ర పోషించనున్నారు. ఆల్‌రౌండర్ దీప్తి శర్మ జట్టుకు సమతూకం తీసుకురానుండగా, వికెట్ కీపింగ్ బాధ్యతలను రిచా ఘోష్ ప్రధానంగా నిర్వర్తించనుంది. ఆమెకు బ్యాకప్‌గా కమలిని ఎంపికయ్యారు. బౌలింగ్ విభాగంలో రేణుకా సింగ్ ఠాకూర్, అరుంధతి రెడ్డి పేస్ విభాగాన్ని నడిపించనుండగా, స్పిన్ విభాగంలో రాధా యాదవ్, శ్రీ చరణి కీలకంగా నిలవనున్నారు. అయితే యువ ఆల్‌రౌండర్ శ్రేయాంక పాటిల్ ఎంపిక ఆమె ఫిట్‌నెస్‌పై ఆధారపడి ఉంటుందని బీసీసీఐ స్పష్టం చేసింది. భారత మహిళల జట్టు గత ఎడిషన్‌లో స్వర్ణ పతకం సాధించిన విషయం తెలిసిందే. అదే విజయాన్ని కొనసాగిస్తూ ఈసారి కూడా డిఫెండింగ్ ఛాంపియన్‌గా బలమైన ప్రదర్శన ఇవ్వాలని జట్టు లక్ష్యంగా పెట్టుకుంది.



# వరల్డ్ కప్‌లో భారత్‌కు నిరాశ

## ర్యాంకింగ్స్‌లో తెలుగు అమ్మాయి హవా!

### ఐసీసీ టీ20 బౌలింగ్‌లో అగ్రస్థానం నిలబెట్టుకున్న శ్రీ చరణి

### వరల్డ్ కప్‌లో 14 వికెట్లతో మెరిసిన యువ స్పిన్నర్

**న్యూఢిల్లీ, జూన్ 30:** మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టు సెమీఫైనల్‌కు చేరుకోలేకపోయినా.. తెలుగు యువ స్పిన్నర్ శ్రీ చరణి మాత్రం తన అద్భుత ప్రదర్శనతో ప్రపంచ క్రికెట్‌లో సత్తా చాటింది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మంగళవారం విడుదల చేసిన తాజా మహిళల టీ20 ర్యాంకింగ్స్‌లో శ్రీ చరణి బౌలర్ల జాబితాలో అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. ప్రపంచకప్‌లో మొత్తం 14 వికెట్లు తీసి అత్యుత్తమ ప్రదర్శన చేసిన శ్రీ చరణి.. ఆస్ట్రేలియాతో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లోనూ రెండు వికెట్లు పడగొట్టి తన స్థిరమైన ప్రదర్శనను కొనసాగించింది. భారత జట్టు టోర్నీ నుంచి నిష్క్రమించినప్పటికీ ఆమె వ్యక్తిగత ప్రతిభకు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు లభిస్తున్నాయి.

#### బౌలర్ల జాబితాలో మార్పులు

టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో ఇంగ్లాండ్ స్పిన్నర్ సోఫీ ఎక్లెస్టోన్ ఒక స్థానం మెరుగుపరచుకుని మూడో స్థానానికి చేరుకుంది. ఆమె సహచర బౌలర్ లారెన్ బెల్ మూడు స్థానాలు ఎగబాకి నాలుగో ర్యాంక్‌ను దక్కించుకుంది. దక్షిణాఫ్రికా స్పిన్నర్ నాన్కులులేకో మ్లాబా ఐదో స్థానానికి చేరుకోగా, పాకిస్థాన్ బౌలర్ నష్రా సంధు తొమ్మిదో స్థానంలో నిలిచింది. మారిజానే కాప్, బ్రీ ఇల్లింగ్ కూడా తమ ర్యాంకులను మెరుగుపరచుకున్నారు.

#### బ్యాటర్లలో వోల్ నంబర్ వన్

మహిళల టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా స్టార్ జార్జియా వోల్ అగ్రస్థానాన్ని కొనసాగించగా, బెత్ మూనీ రెండో స్థానంలో నిలిచింది. దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్ మూడో స్థానానికి చేరుకుంది. శ్రీలంక కెప్టెన్ చమరి ఆటపట్టు ఏడో స్థానంలోకి ఎగబాకగా, ఇంగ్లాండ్ ఓపెనర్ డ్యానీ వ్యాట్ హాడ్జ్ 11వ స్థానానికి చేరుకుంది. భారత్‌పై అర్ధశతకం సాధించిన ఆస్ట్రేలియా సీనియర్ బ్యాటర్ ఎలీస్ పెర్రీ ఐదు స్థానాలు మెరుగుపరచుకుని 17వ ర్యాంక్‌ను దక్కించుకుంది.

#### ఆల్‌రౌండర్లలో హేలీ మాథ్యూస్ అగ్రస్థానం

ఆల్‌రౌండర్ల విభాగంలో వెస్టిండీస్ కెప్టెన్ హేలీ మాథ్యూస్ అగ్రస్థానాన్ని కొనసాగించగా, న్యూజిలాండ్ స్టార్ అమేలియా కెర్ రెండో స్థానంలో నిలిచింది. ఐర్లాండ్‌కు చెందిన ఓర్లా ప్రెండర్‌గాస్ట్ సంయుక్తంగా మూడో స్థానానికి చేరుకుంది. మారిజానే కాప్, అన్నాబెల్ సదర్లాండ్ కూడా తమ ర్యాంకులను మెరుగుపరచుకున్నారు. ఇదిలా ఉండగా.. మహిళల టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్‌కు ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ జట్లు అర్హత సాధించాయి. లండన్‌లోని కెనింగ్టన్ ఓవల్ వేదికగా తొలి సెమీఫైనల్‌లో ఆస్ట్రేలియా-వెస్టిండీస్ జట్లు తలపడనున్నాయి.





## స్టార్ ఛాన్స్ కోసం ఎదురుచూస్తున్న
# అనన్య నాగళ్ల

తెలుగు సినీ పరిశ్రమలో తొలి సినిమాతోనే మంచి గుర్తింపు తెచ్చుకున్నప్పటికీ, స్టార్‌డమ్ మాత్రం ఇంకా అందని ద్రాక్షగానే మిగిలిన కథానాయికల్లో అనన్య నాగళ్ల ఒకరు. సహజమైన నటనతో ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్న ఈ తెలుగు అమ్మాయి, ప్రస్తుతం పెద్ద అవకాశాల కోసం ఎదురుచూస్తోంది. సినిమాల్లోకి రాకముందు అనన్య నాగళ్ల సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగం చేశారు. నటనపై ఆసక్తితో ఉద్యోగానికి రాజీనామా చేసి సినీ రంగంలో అడుగుపెట్టారు. ప్రారంభంలో కొన్ని షార్ట్ ఫిల్మ్‌లలో నటించిన ఆమె, అనంతరం 'మల్లేశం' చిత్రంతో కథానాయికగా పరిచయమై తొలి సినిమాతోనే నటిగా మంచి గుర్తింపు సంపాదించారు. ఆ తర్వాత పవన్ కళ్యాణ్ నటించిన 'వకీల్ సాబ్' చిత్రంలో కీలక పాత్ర పోషించి మరింత గుర్తింపు పొందారు. అనంతరం వరుసగా పలు చిత్రాల్లో నటించినప్పటికీ, కెరీర్‌కు పెద్ద మలుపు తిప్పే విజయాన్ని మాత్రం అందుకోలేకపోయారు. అయినప్పటికీ ప్రతి సినిమాలో తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ ప్రత్యేక గుర్తింపును కొనసాగిస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లోనూ అనన్య నాగళ్ల చురుగ్గా ఉంటున్నారు. తరచూ కొత్త ఫొటోషూట్లు, వ్యక్తిగత విశేషాలను అభిమానులతో పంచుకుంటూ మంచి ఆదరణ పొందుతున్నారు. ఇటీవల గ్లామర్ ఫొటోషూట్లతో కూడా నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నారు. ప్రస్తుతం మంచి కథలతో పాటు స్టార్ హీరోల సరసన నటించే అవకాశాల కోసం అనన్య ఎదురుచూస్తున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఒక పెద్ద ప్రాజెక్టులో అవకాశం దక్కితే ఆమె కెరీర్‌కు కొత్త ఊపు వస్తుందని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.





# ప్రేమా? ప్రచారమా?
### రాఘవ్-నిహారిక ఫొటోలు వైరల్..

ప్రముఖ డాన్సర్, నటుడు రాఘవ్ జుయల్, నటి, కంటెంట్ క్రియేటర్ నిహారిక ఎన్‌ఎమ్ తాజాగా పంచుకున్న ఇన్‌స్టాగ్రామ్ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఇద్దరూ అత్యంత సన్నిహితంగా ఒకరినొకరు ఆలింగనం చేసుకున్న చిత్రాలను ఉమ్మడిగా పంచుకోవడంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఈ పోస్టుకు ఎలాంటి వివరణ ఇవ్వకుండా కేవలం కొన్ని ఎమోజీలను మాత్రమే జత చేయడంతో, వీరిద్దరూ తమ ప్రేమ బంధాన్ని అధికారికంగా ప్రకటించారా? లేక ఇది కొత్త సినిమా ప్రచారంలో భాగమా? అనే చర్చ మొదలైంది. పోస్టు వెలువడిన వెంటనే అభిమానులు, సినీ వర్గాల్లో దీనిపై పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. ఫొటోల్లో నిహారిక ఎరుపు రంగు స్వెట్‌షర్ట్‌లో, రాఘవ్ బూడిదరంగు జాకెట్‌లో కనిపించారు. ఇద్దరి మధ్య కనిపించిన అనుబంధాన్ని చూసి పలువురు అభిమానులు ముందుగానే శుభాకాంక్షలు తెలుపుతుండగా, మరికొందరు ఇది ప్రచార వ్యూహమేనని అభిప్రాయపడుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో వినిపిస్తున్న కథనాల ప్రకారం, వీరిద్దరూ కలిసి నటిస్తున్న 'భాయ్ తేరా స్టార్ హై' చిత్ర ప్రచారంలో భాగంగానే ఈ పోస్టు చేసినట్లు పలువురు విశ్లేషకులు భావిస్తున్నారు. సినిమా విడుదలకు ముందే ఆసక్తి పెంచేందుకు ఇలాంటి ప్రచార పద్ధతులను ఇటీవల ఎక్కువగా అనుసరిస్తున్నారని పేర్కొంటున్నారు. ఇక రాఘవ్ జుయల్ తన కెరీర్‌ను డాన్స్ రియాలిటీ షోలతో ప్రారంభించి, ఆ తర్వాత నటుడిగా గుర్తింపు పొందారు. పలు బాలీవుడ్ చిత్రాల్లో నటించిన ఆయన ఇటీవల పలు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. మరోవైపు నిహారిక ఎన్‌ఎమ్ కూడా డిజిటల్ వేదికలపై తన ప్రత్యేక శైలితో విస్తృత ఆదరణ పొందుతున్నారు. అయితే ఈ ఫొటోలపై రాఘవ్ జుయల్, నిహారిక ఎన్‌ఎమ్ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక వివరణ ఇవ్వలేదు. దీంతో ఇది వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ప్రకటననా? లేక సినిమా ప్రచార వ్యూహమా? అన్నది తెలియాలంటే వారి అధికారిక స్పందన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

# టాక్సిక్ ఓ అద్భుతమైన అనుభం
### నటి హ్యూమా ఖురేషీ ఆసక్తికర వ్యాఖ్యలు

'కేజీఎఫ్' చిత్రాల విజయాల తర్వాత కథానాయకుడు యశ్ నుంచి రానున్న సినిమా 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్'. ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ చిత్రంపై నటి హ్యూమా ఖురేషీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఈ చిత్రానికి సంబంధించిన 9 నిమిషాల కట్‌ను వీక్షించిన ఆమె, సినిమా విజువల్ ట్రీట్‌గా ఉండనుందని స్పష్టం చేశారు. ఈ సినిమాలో యశ్‌తో కలిసి పనిచేసిన తర్వాత, నేను ఆయనకు అభిమానిని అయ్యాను. అంతకుముందు ఆయనొక పెద్ద స్టార్, ఆయనకు భారీ ఫాలోయింగ్ ఉంది అని మాత్రమే నేను అనుకునేదాన్ని. కానీ ఆయన పని చేసే విధానాన్ని, పనిపై ఆయనకున్న అంకితభావాన్ని కళ్లారా చూసి చాలా విషయాలు నేర్చుకున్నాను. ఈ సినిమా తర్వాత యశ్ అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకుంటారు. ఇటీవలే ఇందులో చిన్న సన్నివేశం చూశాను. నేను ఇప్పటి వరకూ అలాంటి విజువల్స్ ఏ సినిమాలోనూ చూడలేదు. ఆ సన్నివేశాలు అభిమానులకు కచ్చితంగా నచ్చుతాయని హ్యూమా అన్నారు. ఆగస్టు 26న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో యశ్ రెండు భిన్నమైన లుక్స్‌లో కనిపించనున్నారు. పీరియాడిక్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా ముస్తాబైన ఈ సినిమాని గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించారు. కియార, నయనతార, రుక్మిణీ వసంత్, హ్యూమా ఖురేషీ, తారా సుతారియా తదితరులు కీలక పాత్రలు పోషించారు.




# నాగబంధంలో అద్భుతమైన పాత్ర నాది
### నటి నభా నటేశ్ ఆసక్తిక విషయాలు వెల్లడి

నేను నటించిన ఓ అరుదైన సినిమా 'నాగబంధం'. ఇందులో పార్వతి అనే వేద విద్యార్థిని పాత్రలో నేను కనిపిస్తా. తన కుటుంబం కోసం, ప్రేమ కోసం ఎంతవరకైనా పోరాడే ఆ పాత్ర కథకు కీలకం. ప్రేక్షకుల్ని ఆశ్చర్యానికి గురిచేసే ఆ పాత్ర చుట్టూనే కథ తిరుగుతుంది. ఇలాంటి పాత్రలు మళ్లీ మళ్లీ చేయాలనుకున్నా వచ్చేవి కాదు. దర్శకుడు అభిషేక్ నామా ఈ కథ చెప్పిన తీరు, ఆయన విజన్ వినగానే నేను ఇందులో భాగం కావాలని నిర్ణయించుకున్నా. ఈ సినిమాని థియేటర్లలో చూసేందుకు ప్రేక్షకుల్లాగే నేనూ ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నానని నటి నభా నటేశ్ అన్నారు. ప్రేక్షకులు చూసి ఆశ్చర్యపోయేలా, నటిగా నేనెంతో గర్వపడేలా చేసే పాత్రనే 'నాగబంధం'లో చేశానని కథానాయిక నభానటేశ్ తెలిపారు. 'ఇస్మార్ట్ శంకర్' చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్న ఈమె అవకాశాల్ని సొంతం చేసుకుంటూ తెరపై మెరుస్తోంది. ఇటీవల 'నాగబంధం'లో ఓ కథానాయికగా నటించింది. విరాట్‌కర్ణ కథానాయకుడిగా... అభిషేక్ నామా దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం జులై 3న ప్రేక్షకుల ముందుకొస్తోంది. తాను పోషించిన పార్వతి పాత్ర కోసం సిద్ధం కావడానికి రోజూ రెండు గంటలు సమయం పట్టేది. ప్రతి కాస్ట్యూమ్ విషయంలో ఎంతో జాగ్రత్త తీసుకోవల్సి వచ్చేది. నమోరే... పాటతోపాటు మరో జానపద గీతం కూడా చేశా. ఈ రెండు పాటలు విజువల్‌గా చాలా ఘనంగా ఉంటాయి. ఐదువేల మంది డ్యాన్సర్లతో నమోరే.. పాటని తెరకెక్కించిన విధానం, తెరపైన ఆ పాట సాగే విధానం చూసి అందరూ ఆశ్చర్యపోతారు. అలాంటి పాటలో నటించడం ఓ నటిగా నాకూ చాలా కొత్త అనుభవం. ఈ సినిమా కోసం దాదాపు 10 సెట్స్ నిర్మించారు. అనంత పద్మనాభ స్వామి ఆలయ సెట్ నిజమైన ఆలయాన్ని తలపిస్తుంది. అక్కడ చిత్రీకరణ జరిగినన్ని రోజులూ మేమంతా నియమాలతో పనిచేశాం. పూర్తిగా శాకాహారమే తిన్నాం. రోజూ పూజ తర్వాతే అక్కడ చిత్రీకరణ మొదలయ్యేది. ఈ సినిమా నిర్మాణం, ప్రచారం నిర్మాతల అభిరుచికి అద్దం పడుతుందని నభా అన్నారు.




Printed, Published and Owned by RAVU RAJITHA, Printed at KAKATHIYA PRINTERS, LN Colony, Uppal IDA, Uppal. Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, RNI NO : TELTEL/2024/86684, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com